


# విభారె
## తెలుగు దినపత్రిక
## VIBHARE TELUGU DAILY

ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
రి.నెం. 119/2015
ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా
ఉచిత కళ్యాణ మండపం
స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము
ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ
సంప్రదించవలసిన చిరునామా
అధ్యక్షులు ఆవుల విజయభాస్కర రెడ్డి అడ్వకేట్ B.A.LLB
ఆళ్లగడ్డ
9440232308,9494498787

PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి ఆదివారం 03 అక్టోబరు 2021 సంపుటి : 03 సంచిక : 55 పేజీలు : 4 వెల : రూ 3-00

# అహింసను మించిన ఆయుధం లేదని ప్రపంచానికి చాటిన మహాత్ముడు

**ఆంధ్రప్రదేశ్ గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్**
**రాజ్ భవన్ లో ఘనంగా గాంధీజీ, శాస్త్రిజీ జయంతి వేడుకలు**
**నేతల చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించి, ఆవరణలో మొక్కలు నాటిని గవర్నర్**



అమరావతి అక్టోబరు 2, (న్యూస్ పల్స్) అహింసను మించిన ఆయుధం లేదని ప్రపంచానికి చాటి చెప్పిన మహాత్ముని జీవితం ఆచరణీయమని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ అన్నారు. కేవలం భారతీయులే కాక ప్రపంచవ్యాప్తంగా జాతి పిత మహాత్మా గాంధీ 152వ జయంతి, భారతదేశ ద్వితీయ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి 117వ జయంతిని జరుపుకుంటున్నారన్నారు. గాంధీ జయంతిని ప్రపంచ వ్యాప్తంగా "అంతర్జాతీయ అహింసా దినోత్సవం"గా జరుపుకోవటం భారతీయులుగా మనకు గర్వకారణమన్నారు. ఇరువురు నేతల జయంతి వేడుకలు శనివారం రాజ్ భవన్ లో ఘనంగా నిర్వహించారు. గవర్నర్ నేతల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

ఈ సందర్భంగా బిశ్వభూషణ్ హరిచందన్ మాట్లాడుతూ మహాత్మా గాంధీ సత్యం, న్యాయం పట్ల విశ్వాసంతో యావత్ ప్రపంచానికి మార్గదర్శిగా నిలిచారన్నారు. అహింసా మార్గంలో శాంతిని నెలకొల్పటానికి గాంధీజీ చేసిన కృషి చిరస్థాయిగా నిలిచి పోతుందన్నారు. భారతదేశ స్వాతంత్ర ఉద్యమానికి మార్గదర్శకత్వం వహించిన గొప్ప నాయకుడిని స్మరించుకోవటానికి, ఆయన కలలు కన్న భారతదేశ నిర్మాణం విషయంలో పునరంకితం కావటానికి జయంతి వేడుకలు ప్రేరణగా నిలుస్తాయన్నారు. మహాత్మాగాంధీ శాంతియుత పౌర హక్కుల ఉద్యమాలలో భాగంగా 1930 నాటి ఉప్పు పన్నుపై దండి మార్చ్, 1942 లో క్విట్ ఇండియా ఉద్యమం ఆలంబనగా బ్రిటిష్ పాలకులు భారతదేశాన్ని విడిచి వెళ్లాలన్న వత్తిడి తీసుకురాగలిగారన్నారు. స్ఫూర్తి దాయకమైన గాంధీజీ ఆలోచనల ఫలితంగానే లక్షలాది మంది ప్రజలు స్వాతంత్ర్య ఉద్యమాలకు సమిధలుగా మారారన్నారు.

గాంధీజీ తన చివరి శ్వాస వరకు దేశంలో సామాజిక సమస్యల నిర్మూలనకు కృషి చేసారని, కుల వ్యవస్థ, అంటరానితనం నిర్మూలన, సమానత్వం, సామాజిక న్యాయం సాధన వంటి విషయాలలో అలుపెరగని పోరాటం చేసారని గవర్నర్ అన్నారు. మరోవైపు లాల్ బహదూర్ శాస్త్రి 117 వ జయంతిని కూడా జరుపుకుంటున్నామని, 'జై జవాన్ జై కిసాన్' అన్న శాస్త్రిజీ నినాదం మనందరి మనస్సులలో శాశ్వతంగా



నిలిచిపోతుందన్నారు. లాల్ బహదూర్ శాస్త్రి సామాన్యులతో అత్యంత సన్నిహితంగా మెలిగిన నేపధ్యంలో ప్రజా జీవితం దేశ ప్రజలలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. లాల్ బహదూర్ శాస్త్రి బలమైన నాయకునిగా దేశ ప్రజల విశ్వాసాన్ని చూరగొన్నప్పటికీ వినయంతో, మృదువుగా మాట్లాడేవారని గవర్నర్ అన్నారు.

పది లక్షల మొక్కల పెంపకంకు శ్రీకారం చుట్టిన గవర్నర్జయంతి వేడుకలలో భాగంగా గవర్నర్ ఆంధ్రప్రదేశ్ రెడ్ క్రాస్ సొసైటీ నేతృత్వంలో పది లక్షల మొక్కల పెంపకానికి శ్రీకారం చుట్టారు. రాజ్ భవన్ ఆవరణలో తొలి మొక్కను నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. రానున్న మూడు నెలల కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా పది లక్షల మొక్కలను నాటటం ద్వారా ఈ కార్యక్రమాన్ని పూర్తి చేయనున్నారు. కార్యక్రమంలో గవర్నర్ వారి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్ పి సిసోడియా, ఆంధ్రప్రదేశ్ రెడ్ క్రాస్ ఛైర్మన్ డాక్టర్ శ్రీధర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎకె ఫరీదా తదితరులు పాల్గొన్నారు.

## 'క్లీన్ ఆంధ్రప్రదేశ్ ....జగనన్న స్వచ్ఛ సంకల్పం'
# క్లాప్ కార్యక్రమాన్ని ప్రారంభించిన సీఎం జగన్



అమరావతి: గ్రామీణ, పట్టణ, నగర ప్రజలకు మెరుగైన పారిశుధ్య సేవలు అందించడమే లక్ష్యంగా రూపొందించిన 'క్లీన్ ఆంధ్రప్రదేశ్ (క్లాప్)?జగనన్న స్వచ్ఛ సంకల్పం' కార్యక్రమాన్ని గాంధీ జయంతి సందర్భంగా శనివారం విజయవాడ బెంజి సర్కిల్ వద్ద సీఎం వైఎస్ జగన్మోహన్రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జగనన్న స్వచ్ఛ సంకల్పం సీడీని ఆవిష్కరించారు. 4,097 చెత్త వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు. రాష్ట్ర ప్రజలు ఆరోగ్యకరమైన పరిసరాల్లో ఆహ్లాదంగా గడపాలన్నదే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం?. క్లాప్కార్యక్రమంలో భాగంగా బిన్ ఫ్రీ, లిటర్ ఫ్రీ, గార్బేజ్ ఫ్రీ రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దే జాతీయస్థాయి స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీల్లో ఉత్తమ ర్యాంక్ సాధించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. 100 రోజులపాటు జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమం కొనసాగనుంది.

**1.20 కోట్ల డస్ట్ బిన్ల పంపిణీ**

గృహాల్లోనే తడి, పొడి, ప్రమాదకర (నాప్కిన్స్, సూదులు, గ్లౌజ్లు, ఎలక్ట్రికల్) చెత్తను వేరు చేసేలా ప్రతి ఇంటికి మూడు డస్ట్ బిన్ల చొప్పున క్లాప్ కార్యక్రమంలో భాగంగా మునిసిపాలిటీల్లో ప్రభుత్వం పంపిణీ చేయనుంది. 123 కార్పొరేషన్లు, మునిసిపాలిటీల్లోని 40 లక్షల గృహాలకు 1.20 కోట్ల డస్ట్ బిన్లు పంపిణీ చేస్తారు. ఇందుకు రూ.100 కోట్ల నిధులను ప్రభుత్వం వెచ్చిస్తోంది. జన సంచారం అధికంగా ఉన్న ప్రాంతాలలో 1,500 పబ్లిక్ టాయిలెట్లు నిర్మించనున్నారు. మరింత మెరుగ్గా చెత్త సేకరణ, తరలింపు కోసం 3,097 ఆటో టిప్పర్లు, 1,771 ఎలక్ట్రిక్ ఆటోలను పంపిణీ చేయనున్నారు.

ఇళ్ల నుంచి సేకరించిన చెత్తను 5,868 జీపీఎస్ ఆధారిత గార్బేజ్ టిప్పర్ల ద్వారా గార్బేజ్ ట్రాన్స్ఫర్ స్టేషన్లకు తరలిస్తారు. 124 మునిసిపాలిటీలలో 231 గార్బేజ్ ట్రాన్స్ఫర్ స్టేషన్(జీటీఎస్)లు ఏర్పాటు చేయడంతో పాటు 72 మునిసిపాలిటీలలో ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ (ఐఎస్డబ్ల్యూఎమ్) ప్రాజెక్టుల కోసం ఏజెన్సీల ఖరారుకు ఇప్పటికే టెండర్లు పిలిచారు. లక్ష పైచిలుకు జనాభా కలిగిన 32 మునిసిపాలిటీలలోని డంప్ సైట్లలో వ్యర్థాల నిర్మూలనకు టెండర్లు పిలవాలని మున్సిపాలిటీలను ఆదేశించారు. రాష్ట్రంలోని 65 నాన్ అమృత్ సిటీలలో సెప్టిక్ ట్యాంక్ల నుంచి సేకరించిన వ్యర్థాలను శుద్ధి చేసేందుకు ఫీకల్ స్లడ్జ్



ట్రీట్మెంట్ ప్లాంట్లు (ఎఫ్ఎస్టీపీ) ఏర్పాటు చేయనున్నారు.

**నిర్వహణకు సిబ్బంది నియామకం..**

చెత్త సేకరణ, రవాణా, శుద్ధీకరణ, పరిసరాల పరిశుభ్రతకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రాలలో ఎక్కువ భాగం సరైన నిర్వహణ లేక నిరుపయోగంగా మారాయి. ఈ కేంద్రాల వద్ద నలుగురు చొప్పున సిబ్బందిని నియమించి జీతభత్యాలు, నిర్వహణకు చర్యలు చేపట్టనున్నారు. కొత్తగా 4,171 చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రాలను నిర్మించనున్నారు.

**గ్రామాల్లో 14 వేల త్రిచక్ర వాహనాల పంపిణీ**

చెత్త రవాణా కోసం గ్రామ పంచాయతీలకు 14 వేల త్రిచక్ర వాహనాలు పంపిణీ చేస్తారు. చెత్త సేకరణ?రవాణాను మరింత మెరుగుపరిచేందుకు వెయ్యి ఆటోలు సమకూరుస్తారు. వ్యర్థాలను ఉష్ణోగ్రతల వద్ద భస్మం చేసి పర్యావరణ హితంగా మార్చేందుకు 6,417 ఇన్సినరేటర్ పరికరాలను కూడా ప్రభుత్వం పంపిణీ చేయనుంది. ప్రజా మరుగుదొడ్లలో పరిశుభ్రత కోసం 10,731 హై ప్రెజర్ టాయిలెట్ క్లీనర్లు కేటాయించారు. దోమల నివారణకు 10,628 థర్మల్ ఫాగింగ్ మిషన్ల పంపిణీ చేపడతారు. 135 మేజర్ పంచాయతీలలో సమగ్ర ద్రవ వ్యర్థాల నిర్వహణ, 10,645 పంచాయతీలలో వర్మి కంపోస్ట్ నిర్వహణ, నాన్ రీసైక్లింగ్ వ్యర్థాలను సమీపంలోని సిమెంట్ ఫ్యాక్టరీలు, సంపద తయారీ కేంద్రాలకు తరలించేలా చర్యలు తీసుకుంటారు.

# పవన్ టూర్ని ఆపాల్సిన అవసరం ప్రభుత్వానికి లేదు: సజ్జల



తాడేపల్లి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర నేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి సజ్జల నివాళులర్పించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'మహాత్మాగాంధీ ఒక యుగపురుషుడు. ప్రజాస్వామ్యానికి నిజమైన అర్థంలో గాంధీ సూక్తులు బోధించారు. కోట్లాది మందిలో స్ఫూర్తిని రగిల్చారు. గత రెండేళ్లుగా రాష్ట్రంలో జగన్ పాలన గాంధీ ఆలోచనా రూపాన్ని ఆచరణలో పెట్టిన విషయం అర్థం అవుతుంది. గాంధీ మార్గంలో ప్రయాణించడానికి పునరంకితమవుదాం. ప్రజలందరూ భాగస్వాములు కావాలి' అని కోరారు. కోవిడ్ నిబంధనలు అందరికీ సమానమే. ప్రజల ఆరోగ్యం కోసమే నిబంధనలు. ఇలాంటి సమయంలో బలప్రదర్శన వల్ల ఇబ్బంది పడేది ప్రజలే. అక్టోబర్లో కోవిడ్ పెరిగే అవకాశాలున్నాయని నిపుణులు చెప్తున్నారు. పవన్ టూర్ని ఆపాల్సిన అవసరం ప్రభుత్వానికి లేదు. రోడ్ల గుంతలు మీరు పూడ్చడం ఏమిటి?. అందుకు సీఎం జగన్ రూ.2,200 కోట్లు కేటాయించారు.

# 'ప్రజలను రెచ్చ గొట్టి లబ్ధి పొందాలనే ఆలోచనలో పవన్'

**బీసీ సంక్షేమ శాఖ మంత్రి వేణుగోపాల కృష్ణ**

తూర్పు గోదావరి: పవన్ కల్యాణ్ ఎంచుకున్న కార్యక్రమం ప్రజలు హర్షించేది కాదని బీసీ సంక్షేమ శాఖ మంత్రి వేణుగోపాల కృష్ణ మండిపడ్డారు. ఆయన శనివారం మీడియాతో మాట్లాడుతూ.. చంద్రబాబు పాలనలో వర్షాలు కురవలేదన్న విషయాన్ని పవన్ కల్యాణ్ ఆలోచించాలన్నారు. టీడీపీ పాలకులు వేసిన రోడ్లు ఇప్పుడు పడుతున్నవర్షాలకు ధ్వంసం అయ్యాయని తెలుసుకోవాలన్నారు. తనకున్న గ్లామర్ను ప్రజలకు ఉపయోగపడేలా చేయకుండా అశాంతిని సృష్టిస్తున్నాడని మండిపడ్డారు. తాత్కాలికంగా




ఒకసారి కనిపించి ప్రజలను రెచ్చ గొట్టి లబ్ధి పొందాలన్న ఆలోచనలో పవన్ కల్యాణ్ ఉన్నాడని దుయ్యబట్టారు. వర్షాలు తగ్గిన వెంటనే రూ.5,600 కోట్లతో రోడ్లు మరమత్తులు చేయాలన్న ఆలోచనలో సీఎం జగన్ ఉన్నారని తెలిపారు.

# 'చంద్రబాబు తోడు లేకుండా పవన్ రాజకీయం చేయలేరు'



తాడేపల్లి: శ్రమదానం పేరుతో పవన్ కల్యాణ్ పబ్లిసిటీ స్టంట్ చేశారని, ఈ తరహా శ్రమదానం పవన్ ఒక్కరే చేయగలరేమో అని వ్యవసాయశాఖ మంత్రి కురసాల కన్నబాబు ఎద్దేవా చేశారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వైఎస్సార్సీపీపై యుద్ధం ప్రకటించానని పవన్ చెబుతున్నారని, ఏ కారణంతో ప్రభుత్వంపై యుద్ధం చేస్తున్నారో చెప్పాలని సూటిగా ప్రశ్నించారు. కోవిడ్ సమయంలో పేదలను ఆదుకున్నందుకు యుద్ధం చేయాలా? అని నిలదీశారు.ప్రభుత్వ బడుల్లో ఇంగ్లీష్ మీడియం పెట్టినందుకు యుద్ధం చేయాలా? అని మండిడ్డారు. సీఎం వైఎస్ జగన్ పేదరికంపై యుద్ధం ప్రకటించారని తెలిపారు. అందుకే సీఎం వైఎస్ జగన్ను ప్రజలు గుండెల్లో పెట్టుకున్నారని పేర్కొన్నారు. వరుస ఎన్నికల్లో వస్తున్న ఫలితాలే అందుకు నిదర్శనం అన్నారు. సీఎం వైఎస్ జగన్కు రాష్ట్ర ప్రజలు వెన్నుదన్నుగా ఉన్నారని తెలిపారు. పవన్ కులాల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. రాజకీయాల్లో కులాన్ని ఎజెండా చేస్తున్నామని ప్రకటించినట్టున్నారని ఎద్దేవా చేశారు. చంద్రబాబు తోడు లేకుండా పవన్ రాజకీయం చేయలేరని దుయ్యబట్టారు. రోడ్లు పూడుస్తామని చెప్పి కుల రాజకీయాలు చేశారని ధ్వజమెత్తారు.అంతర్వేదీ ఘటనపై 24 గంటల్లోనే సీబీఐ విచారణ కోరామని తెలిపారు. ప్రతి అంశాన్ని రాజకీయం చేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. ప్రజాస్వామ్య వ్యవస్థపై పవన్కు నమ్మకం లేదని అన్నారు. అందుకే ఉగ్రవాదులు మాట్లాడే వ్యాఖ్యలు చేస్తున్నారని అన్నారు. అతను కులాలు చూస్తున్నారని, తాము సంక్షేమం చూస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో కులాల మధ్య సామరస్యత ఉందని, చిన్న చిన్న కులాలను కూడా గుర్తించి న్యాయం చేస్తున్నామని అన్నారు. కులమతాలకతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. కుల రాజకీయం చేసినవాళ్లు ఇంతవరకూ విజయం సాధించలేదని అన్నారు.

# నా సహనాన్ని ఇక పరీక్షించొద్దు: పవన్



అమరావతి: ఏపీప్రభుత్వం జనసేన అధినేత పవన్కల్యాణ్ మధ్య మాటల తూటాలు ఇంకా పేలుతూనే ఉన్నాయి. తూర్పు గోదావరి జిల్లాలో బాలాజీపేట రోడ్డుకు శ్రమదానం చేసిన తర్వాత బహిరంగ సభలో పవన్ పాల్గొననున్నారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ నేను యాక్షన్, కట్ అంటే వెళ్లిపోయే వాడిని కాదు. నా సహనాన్ని ఇక పరీక్షించొద్దు. కనీసం రెండు దశాబ్దాలు నాతో ప్రయాణం చేయగలిగితేనే జనసేనలోకి రండి. నేను తూర్పుగోదావరి జిల్లాలోకి అడుగుపెట్టలేనని బెట్టింగులు కట్టారు. నాపై నోటికి వచ్చినట్లు మాట్లాడొద్దు. ఇవి మెతక లీడర్లు ఉన్న రోజులు కావు. రాష్ట్ర రాజకీయాలు రెండిళ్ల మధ్య జరిగితే కుదరదు" అని పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. ఒక కులాన్ని వర్గ శత్రువుగా చేసుకుని వైసీపీ రాష్ట్రాన్ని నాశనం చేసిందని ధ్వజమెత్తారు. అందుకే రోడ్లు లేవు, జీతాలు, పెన్షన్లురావని విమర్శించారు. తాను బైబిల్ చేత్తో పట్టుకుని తిరిగేవాడిని కాదని, గుండెల్లో పెట్టుకుంటానని తెలిపారు. కాపు, ఒంటరి, తెలగ, బలిజలు ముందుకు వస్తే తప్ప రాష్ట్ర రాజకీయాల్లో మార్పురాదని స్పష్టం చేశారు. నాలుగు కులాలు పెద్దన్నపాత్ర పోషిస్తే తప్ప మిగిలిన కులాలకు సాధికారిత రాదని పవన్ కల్యాణ్ తెలిపారు.

# అవినీతిపరుల చేతికి అధికారమిచ్చి బాపూ కోరిన సమాజాన్ని నిర్మించగలమా?: నారా లోకేష్



అమరావతి: అంటరానితనం లేని సమ సమాజ నిర్మాణం జరగాలని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పేర్కొన్నారు. పురుషుల్లాగే మహిళలు సైతం సమాన హక్కులు అనుభవించగలగాలన్నారు. మత్తు, మాదకద్రవ్యాలు లేని విధంగా దేశం రూపుదిద్దుకోవాలన్నారు. మహాత్ముని కలలు నెరవేరాలంటే పాలకుల్లో చిత్తశుద్ధి ఉండాలని నారా లోకేష్ పేర్కొన్నారు. అవినీతిపరుల చేతులకు అధికారమిచ్చి గాంధీజీ కోరుకున్న సమాజాన్ని నిర్మించగలమా? అని ప్రశ్నించారు. మహోన్నత ప్రజానాయకుని బోధనలను, సచ్చరిత్రను స్మరించుకుందామని నారా లోకేష్ పేర్కొన్నారు.

# అడుగుకో అబద్ధం, కక్ష, హింసే ధ్యేయంగా జగన్ పాలన: యనమల

అమరావతి: హింస, దౌర్జన్యాలే లక్ష్యంగా జగన్ రెడ్డి పాలన సాగుతోందని టీడీపీ సీనియర్ నేత యనమల రామకృష్ణుడు పేర్కొన్నారు. స్వేచ్ఛను హరిస్తూ స్వచ్ఛ సంకల్పం నిర్వహణ హాస్యాస్పదమన్నారు. ప్రజలపై చెత్త పన్ను వేస్తూ చెత్త పాలనకు శ్రీకారం చుట్టారన్నారు. అడుగుకో అబద్ధం, కక్ష, హింసే ధ్యేయంగా జగన్ పాలన సాగుతోందని యనమల విమర్శించారు. అవినీతి, కుంభకోణాలకు కేరాఫ్ అడ్రస్గా జగన్ రెడ్డి పాలన మారిందన్నారు.

# సంపాదకీయం

ఆదివారం 03 అక్టోబరు 2021

## తెలుగు రాష్ట్రాల్లో పవన్ దుమారం

పవన్ కల్యాణ్ పొలిటికల్ ట్రాక్ రికార్డులో మరో పరాజయం నమోదైందా? లేక తాను అనుకున్న ఫలితం సాధించగలిగాడా? అన్న ప్రశ్న తాజాగా సినిమా, రాజకీయ వర్గాల నుంచి ఎదురవుతోంది. రిపబ్లిక్ సినిమా ఫంక్షన్ లో చేసిన వ్యాఖ్యల దుమారం ఇంకా చల్లారలేదు. అటు రాజకీయ రంగం, ఇటు సినిమా రంగం వేడెక్కిపోయింది. పవన్ కల్యాణ్ దూకుడు కారణంగా తామెక్కడ మునిగిపోతామోనని సినిమా పెద్దలు బెంబేలెత్తిపోతున్నారు. జనసేన సమావేశాల్లో వ్యాఖ్యలు చేసి ఉంటే సరిపోయేది. సినిమా వేడుకలో చేయడంతోనే తంటాలు వచ్చి పడ్డాయని చిత్రపరిశ్రమలోని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏదేమైనా ప్లేస్, టైమ్ తో సంబంధం లేకుండా పర్యవసానాలను పట్టించుకోకుండా తాను అనుకున్నది చెప్పేసే (అవ)లక్షణం పవన్ కు ఫుల్ గా ఉంది. దాంతో తాజాగా ఏపీలో చర్చనీయమైన కోటాలో చేరిపోయాడు. అయితే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పై చేసిన వ్యాఖ్యలు వ్యూహాత్మకంగా, ఉద్దేశపూర్వకంగానే చేశారనేది జనసేన నాయకుల అభిప్రాయం. ఆమేరకు పార్టీకి ఫలితం కూడా లభించిందంటున్నారు.ఇటీవలి కాలంలో జనసేన దూకుడు పెంచింది. పవన్ కల్యాణ్ ప్రజాసమస్యలపై ఫోకస్ పెట్టారు. రోడ్ల అధ్వాన్న స్థితిపై కొన్నిలక్షల ట్వీట్లతో సామాజిక మాధ్యమాలు హోరెత్తిపోయాయి. రెండున్నర సంవత్సరాలుగా పైసా కూడా ఖర్చు చేయకుండా రోడ్లను గాలికి వదిలేసింది వైసీపీ సర్కారు. దాంతో పవన్ కల్యాణ్ చేపట్టిన రోడ్ల ఉద్యమం ముఖ్యమంత్రిని, ప్రభుత్వాన్ని ఆత్మరక్షణలో పడేసింది. ఈ విషయంలో ప్రజల నుంచి వ్యక్తమవుతున్న సంఘీభావం వైసీపీకి ఇరకాటంగా మారింది. ఎమ్మెల్యేలు, మంత్రులు సమాధానం చెప్పుకోలేని పరిస్థితిలో పడ్డారు. ఈ నేపథ్యంలో దీనిని మరింత ఉద్ధృతం చేయకుండా పవన్ కల్యాణ్ సినిమా టిక్కెట్ల ప్రభుత్వ విక్రయాలపై ధ్వజమెత్తారు. . ప్రజలు నిత్యం ఎదుర్కొనే సామాజిక సమస్యల నుంచి జనసేన ట్రాక్ తప్పింది. దీంతో వైసీపీ తెలివిగా ట్రాప్ చేసింది .ప్రజల దైనందిన సమస్య అయితే ప్రభుత్వం సమాధానం చెప్పుకోవాలి. కానీ సినిమా టిక్కెట్ల అమ్మకం వంటి చిన్న విషయం కావడంతో సర్కారు తేలికగానే సమాధానం చెప్పేసింది. పైపెచ్చు రోడ్ల దుస్థితి, పెట్రోల్ పై అదనపు పన్నులు, విద్యుత్ రేట్ల పెంపుదల, ఇంటిపన్నుల పెంపుదల వంటి ప్రధాన అంశాలు పక్కన పెట్టేసినట్లయింది. పవన్ కల్యాణ్ ను వ్యక్తిగతంగా టార్గెట్ చేస్తూ చిత్రపరిశ్రమకే చెందిన పోసానిని రంగంలోకి దింపారు. దీంతో అసలు అంశాలు మరుగున పడ్డాయి. అభిమానులు పోసానిని తిట్టిపోయడానికి, దాడి చేయడానికి ప్రయత్నించడంతో మొత్తం విషయమంతా వ్యక్తిగత బురద చల్లుకుంది. పోసాని వర్సస్ పవన్ కల్యాణ్ గా రంగు మారింది. వైసీపీ సర్కారు తెలివిగా గట్టేక్కేసింది.ఇటీవలి కాలంలో తెలుగుదేశం అధినేత చంద్రబాబు నాయుడు, వారసుడు లోకేశ్ ఏపీ పర్యటనలు పెంచారు. ప్రజల్లో తిరిగేందుకు ప్రయత్నిస్తున్నారు. కోవిడ్ కాలంలో దాదాపు ఆంధ్రప్రదేశ్ కు దూరంగా ఉన్న ప్రతిపక్ష నాయకుడు ఇప్పుడు మళ్లీ పార్టీని గాడిలో పెట్టేందుకు ప్రజాసమస్యలపై ఉద్యమాలు చేసేందుకు సిద్ధమవుతున్నారు. పవన్ కల్యాణ్ సృష్టించిన దుమారంతో టీడీపీనేతల ప్రకటనలు, ఆందోళనలు ప్రజల్లో చర్చకే రావడం లేదు. మీడియా సైతం వారిని పట్టించుకోవడం మానేసింది. జనసేన, వైసీపీల మధ్యనే ప్రచారం, ఆరోపణలు కేంద్రీకృతమయ్యాయి. ఈ మొత్తం ఉదంతంలో ఏవిధంగా స్పందించాలో తెలియని అయోమయ పరిస్థితికి టీడీపీ లోనవుతోంది. ఏదేమైనా సినిమా రంగానికి సంబంధించిన ఇష్యూ అయినప్పటికీ పవన్ కల్యాణ్ మాత్రం టీడీపీని తోసిరాజంటూ ప్రచారంలో నంబర్ వన్ స్థానానికి చేరుకున్నారు. వైసీపీని దీటుగా తాను ఎదుర్కోగలననే భరోసాను జనసేన శ్రేణులకు అందించగలిగారు. అవసరమైతే సినిమా కెరియర్ ను త్యాగం చేసి రాజకీయంగా చూసుకునేందుకు సిద్దమని తేల్చి చెప్పారు. ఇది టీడీపీ శ్రేణులకు మింగుడు పడటం లేదు. జనసేన ఒంటరిగా రంగంలోకి దిగినా, ప్రధాన ప్రతిపక్షం అన్న ముద్రను లాగేసుకున్నా చంద్రబాబు నాయుడు, లోకేశ్ కు కష్టకాలమే.మొత్తం వ్యవహారం సినిమా పరిశ్రమకు చుట్టుకుంటోంది. పవన్ కల్యాణ్ కు సినిమాల పట్ల సీరియస్ నెస్ లేదు. తెగించి రాజకీయం చేయాలనుకుంటున్నాడు. అందువల్ల అతనికి వచ్చిన నష్టం ఏమీ లేకపోవచ్చు. కానీ చిత్రరంగాన్ని మొత్తాన్ని ఇబ్బంది పెట్టే ప్రకటనలు చేయడం వల్ల ఏపీ ప్రభుత్వంతో అనవసరంగా తగవు తెచ్చి పెట్టాడని సినిమా పెద్దలు వాపోతున్నారు. తెలుగు ఇండస్ట్రీ బతికిబట్టకట్టాలంటే ఏపీ నుంచి వచ్చే ఆదాయం చాలా ముఖ్యం. ప్రత్యర్థుల పట్ల కక్షపూరితంగా వ్యవహరించడంలో వైసీపీ సర్కారు ఎంతవరకైనా తెగిస్తుంది. ఈవిషయాన్ని గతంలోనే అనేక నిర్ణయాల్లో నిరూపించుకుంది. పవన్ పుణ్యమా? అని ఇప్పటికే కొన ఊపిరితో పరిశ్రమకు మరిన్ని కష్టాలు వచ్చి పడతాయనుకుంటున్నారు. టాలీవుడ్ కు లభిస్తున్న ఆదాయంలో 35శాతం తెలంగాణ నుంచి లభిస్తుంటే 65శాతం ఆంధ్రప్రదేశ్ నుంచి వస్తోంది. టిక్కెట్ల రేట్ల తగ్గింపు ,బెన్ ఫిట్ షోల నిషేధం ఇతర నిర్ణయాలతో ప్రభుత్వం చర్యలకు పూనుకుంటే నిండా మునిగిపోవడం ఖాయం. అందుకే పవన్ కల్యాణ్ అభిప్రాయాలతో మాకు సంబంధం లేదంటూ పదే పదే చెబుతూ ప్రభుత్వం ముందు సాగిలపడుతున్నారు సినిమా పెద్దలు. భవిష్యత్తులో పవన్ కల్యాణ్ ను హీరోగా పెట్టి సినిమాలు తీసేందుకు పెద్ద నిర్మాతలు సాహసించకపోవచ్చు.

# పెళ్లి చేసుకోని మాజీ ప్రేమికులు అలా....

కర్నూలు, అక్టోబరు 2, (న్యూస్ పల్స్)వారిద్దరిది ఒకే గ్రామం.. యుక్త వయసులో ఇద్దరూ గాఢంగా ప్రేమించుకున్నారు.. పెళ్లి చేసుకుని, సుఖంగా గడపాలని కలలు కన్నారు. కానీ, పెద్దలు వీరి ప్రేమ బంధానికి అడ్డుపడ్డారు. పెద్దలు అంగీకరించక పోవడంతో ఇద్దరు వేర్వేరు పెళ్లిళ్లు చేసుకున్నారు. అయినా గతం వీరిని వెంటాడింది. యుక్త వయసులో ఇద్దరి ప్రేమ ఊసుల జ్ఞాపకాలు మదిలో మెదిలేవి. మనసులు దగ్గరగా ఉన్నా.. మనుషులు వేరుగా బతకాల్సిన పరిస్థితి. ఈ నేపథ్యంలో చివరకు అనూహ్య నిర్ణయం తీసుకుని చావులోనూ కలసి పయనించి.. ఇద్దరూ ఈ లోకాన్ని వీడారు. కర్నూలు జిల్లా శ్రీశైలంలో పురుగుమందు తాగి ఆత్మహత్యకు చేసుకున్న ఇద్దరి జీవితాలు ఇలా ముగిశాయి.బత్తుల వెంకట కాళేశ్వరరావు (45), బత్తుల నాగలక్ష్మి (40) ఇద్దరిదీ గుంటూరు జిల్లా నరసరావుపేట మండలం ఇస్సపాలెం గ్రామం. వీరిద్దరూ 15 ఏళ్ల క్రితం ప్రేమించుకున్నారు. పెళ్లి చేసుకోవాలని భావించారు. కానీ, ఇరు కుటుంబాల పెద్దలు అంగీకరించలేదు. దీంతో కాళేశ్వరరావుకు గుంటూరుకు చెందిన లక్ష్మితో వివాహమైంది. నాగలక్ష్మికి నరసరావుపేట పట్టణానికి చెందిన వ్యక్తితో వివాహమైంది.కాళేశ్వరరావు గ్రామంలోనే ఉంటూ తాపీ మేస్త్రీగా పని చేసేవాడు. ఇతనికి ఇద్దరు ఆడపిల్లలు, ఒక మగ పిల్లవాడు సంతానం. బత్తుల నాగలక్ష్మి నరసరావుపేట పట్టణంలోని పెద్దచెరువులో నివాసముండేది. భర్త టైలర్‌గా పని చేసేవాడు. నాగలక్ష్మి దంపతులకు ఇద్దరు పిల్లలు. అయితే కరోనా మహమ్మారి కారణంగా కుటుంబం గడవటం కష్టంగా ఉ ండటంతో ఏడాది క్రితం నాగలక్ష్మి భర్తను తీసుకొని, తన స్వగ్రామమైన ఇస్సపాలెం వచ్చింది.ఇక్కడే ఉంటూ పలువురికి టైలరింగ్‌లో శిక్షణ ఇస్తూ జీవనం సాగించేది. ఇంతలో ఏం జరిగిందో తెలియదు కానీ కాళేశ్వరరావు, నాగలక్ష్మి ఇంట్లో నుంచి వెళ్లిపోయారు. ఇదే సమయంలో నాగలక్ష్మి కనిపించడం లేదంటూ గ్రామీణ పోలీస్ స్టేషన్‌లో ఆమె అక్క శివరాత్రి వెంకటరమణ ఫిర్యాదు చేసింది. మహిళ అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారుఇంతలోనే కాశేశ్వరరావు తన భార్య లక్ష్మికి ఫోన్ చేశాడు. "నా గురించి ఎదురు చూడవద్దు. నాపై ఆశలు పెట్టుకోవద్దు" అంటూ బత్తుల కాళేశ్వరరావు తన భార్య లక్ష్మీకి కాల్ చేసి చెప్పి ఫోన్ పెట్టేశాడు. అనుమానం వచ్చిన లక్ష్మి తిరిగి భర్తకు భర్తకు కాల్ చేయగా స్పందించలేదు. రెండు గంటల అనంతరం కాళేశ్వరరావు భార్యకు శ్రీశైలం పోలీసుల నుంచి ఫోన్ రాగా, ఊహించని విషయం తెలిసింది.శ్రీశైలం మహాక్షేత్రంలోని ఓ ప్రైవేట్ సత్రంలో కాశేశ్వరరావు, నాగలక్ష్మి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. శ్రీశైలం ఎస్సై సతీష్ కుమార్ తెలిపిన వివరాల మేరకు.. గత బుధవారం రాత్రి 9 గంటల సమయంలో ఇద్దరూ కలిసి సత్రంలో గదిని అద్దెకు తీసుకున్నారు. గురువారం ఉదయం కూల్‌డ్రింక్‌లో పురుగుల మందు కలుపుకుని తాగారని ఎస్సై సతీష్ కుమార్ తెలిపారు.పురుగుల మందు తాగిన వెంకటకాళేశ్వరరావు కడుపులో తిప్పుతోందని గట్టిగా కేకలు వేయడంతో సత్రం సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే 108 వాహనంలో సున్నిపెంట వైద్యశాలకు తరలించారు. అయితే, చికిత్స పొందుతూ ఇద్దరూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు. పోస్ట్‌మార్టం అనంతరం వారి బంధువులకు మృతదేహాలను అప్పగించినట్లు ఎస్సై తెలిపారు. ఇలా, పెళ్లయిన 15 ఏళ్ల తర్వాత.. ప్రేమికులు ఆత్మహత్య చేసుకుని వారి కుటుంబాల్లో తీరని విషాదం నింపారు. రెండు కుటుంబాల్లోని బిడ్డలు అన్యాయంగా అనాథలుగా మారారు.

# ట్రూ అప్ ల భారం...

ఒంగోలు, అక్టోబరు 2, (న్యూస్ పల్స్)కేంద్రం విధిస్తున్న షరతులతో రాష్ట్ర ప్రజలపై విద్యుత్ భారం పెరుగుతోంది. అదనపు రుణాలు తీసుకోవడానికి అనుమతించాలంటే డిస్కామ్‌ల ప్రయివేటీకరణ, ఈలోగా వాటి నష్టాలను తగ్గించడం వంటి అంశాలపై కేంద్రం చేస్తున్న ఒత్తిడి వల్లనే రాష్ట్రంలో సంస్కరణల అమలు వేగవంతమవుతోందని, విద్యుత్ భారాలు పెరుగుతున్నాయని అధికారులు విశ్లేషిస్తున్నారు. కేంద్ర ఆర్థికశాఖ (వ్యయ విభాగం) ఇటీవల నిర్వహించిన ఒక సమావేశంలో ఈ అంశాలు చర్చకు రాగా, ఆరధ్రప్రదేశ్‌తోపాటు కొన్ని రాష్ట్రాలు అంగీకారం తెలిపినట్లు తెలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం రానున్న నాలుగేళ్లలో రూ. 23,227 కోట్లు అదనపు రుణం తీసుకునేందుకు అవకాశం వుంటుందని, అందుకు ఆయా షరతులు అమలు చేయాలనీ కేంద్రం స్పష్టం చేసింది.ఇంధన శాఖలో సంస్కరణలను అమలు చేస్తే అందుకు ప్రతిఫలంగా జిఎస్‌డిపిలో 0.50 శాతం అదనపు రుణం లభిస్తుంది. డిస్కామ్‌ల నష్టాలను రాష్ట్రాలు భరించాల్సి ఉ ంటుంది. తొలి ఏడాది 60 శాతం నష్టాలను రాష్ట్రాలు భరించాల్సి ఉండగా, రెండో ఏడాది 75 శాతం, మూడో ఏడాది 90 శాతం నష్టాలను భరిస్తూ 2024-25 నాటికి వంద శాతం భరించాల్సి ఉంటుంది. అంటే 2025 మార్చి 31 నాటికి డిస్కాములకు ఒక్క రూపాయి కూడా నష్టం ఉండరాదన్నమాట. సంపూర్ణ ఆర్థిక ఆరోగ్యంతో ప్రైవేటువారికి డిస్కాముల్ని పూర్తిగా కట్టబెట్టొచ్చు. వీటితోపాటు అదనపు రుణానికి సంబంధించి కేంద్రం దాదాపు 12 షరతులను నిర్దేశించింది. ఇందులో వరుసగా నాలుగేళ్లపాటు ఏ ఏడాది ఏయే సంస్కరణలు చేపట్టాలో స్పష్టం చేసింది. ప్రతియేటా డిస్కామ్‌లు తీసుకున్న అదనపు రుణాలపై ఆడిట్ నిర్వహించాలని, ప్రతి త్రైమాసికానికి ఈ నివేదికలు సమర్పించాలని నిర్దేశించింది. బకాయిల వసూళ్లపైనా నివేదికలు ఇవ్వాలని, కొత్త ఆస్తుల కల్పన వద్దని కూడా ఒక ఆంక్షగా పేర్కొనడం గమనార్హం. గత నష్టాలను భర్తీ చేసుకునేందుకు ట్రూఅప్ ఛార్జీల వసూళ్లను కూడా ఒక షరతుగా కేంద్రం పేర్కొంది. ప్రతి ఏటా ఏప్రిల్ ఒకటవ తేదీ ప్రాతిపదికగా ట్రూఅప్‌ను ఛార్జీల్లో చూపించాలని నిర్దేశించడం గమనార్హం. విద్యుత్ ఆదాయ వ్యయాలకు సంబంధించి ప్రతి త్రైమాసిక వివరాలను కేంద్ర ఇంధన శాఖకు పంపించాలని స్పష్టం చేసింది. డిస్కామ్‌ల రుణాలకు సంబంధించి లెటర్ ఆఫ్ క్రెడిట్ తప్పనిసరి చేసింది. విద్యుత్ కొనుగోళ్లకు సంబంధించి ఒప్పందాలపైనా ఆంక్షలు విధించడం గమనార్హం. కొత్తగా వచ్చే అదనపు రుణాల కోసం రాష్ట్రంలో ఎఫ్‌ఆర్‌బిఎం చట్టాన్ని సవరణ చేయాలని నిర్దేశించింది. ఒక ఏడాది అనుమతించిన అదనపు రుణాన్ని తీసుకోని పక్షంలో ఆ తరువాతి ఏడాది కొత్తగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని పేర్కొంది. అలాగే డిస్కామ్‌ల భవిష్యత్ నష్టాలను రాష్ట్రాలు తీసుకోవాలని, డిస్కామ్‌ల అప్పులపై ప్రతి నెలా నివేదికలు సమర్పించాలని తేల్చిచెప్పింది.

# త్వరలో బోర్లకు మీటర్లు

శ్రీకాకుళం, అక్టోబరు 2, (న్యూస్ పల్స్)కేంద్ర ప్రభుత్వ షరతులు రాష్ట్రంలోని రైతుల మెడకు చుట్టుకుంటున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు వ్యవసాయ బోర్లకు డిజిటల్ వాటర్ ఫ్లో మీటర్లు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. పంటలకు వినియోగిస్తోన్న భూగర్భ జలాలకు లెక్కగట్టేందుకు సిద్ధమవుతోంది. ప్రపంచ బ్యాంకుతో కుదుర్చుకున్న ఒప్పందంలో భాగంగా నేషనల్ హైడ్రాలజీ ప్రాజెక్టు ద్వారా ఇది అమలు కానుంది. కేంద్ర ప్రభుత్వం విధించిన షరతుల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ పంప్‌సెట్లకు మీటర్లు బిగిస్తోన్న విషయం విదితమే. శ్రీకాకుళం జిల్లాలో ఈ ప్రక్రియను ఇప్పటికే పూర్తి కాగా మిగిలిన జిల్లాల్లో అమలు చేస్తోంది. తాజాగా బోర్లకు నీటి మీటర్ల ఏర్పాటుతో రైతుల మెడకు మరో ఉచ్చు బిగిస్తోంది. నీటివనరుల విస్తరణ, నాణ్యత, లభ్యతను పెంపొందించడం లక్ష్యం అంటూ కేంద్ర ప్రభుత్వం నేషనల్ హైడ్రాలజీ ప్రాజెక్టును 2016-17 ఆర్థిక సంవత్సరంలో ప్రారంభించింది. ఈ ప్రాజెక్టుకు అవసరమైన నిధులను ప్రపంచ బ్యాంకు అప్పుగా ఇస్తోంది. దేశవ్యాప్తంగా దీన్ని అమలు చేయాలంటే రూ. 3,680 కోట్ల బడ్జెట్ అవసరమని అంచనా వేసి, ఇందులో 50 శాతం ప్రపంచ బ్యాంకు అప్పుగా ఇవ్వనుంది. ప్రాజెక్టు కాలపరిమితి 2016-17 నుంచి 2023-24 వరకు నిర్దేశించింది. 2016 ఏప్రిల్ ఆరో తేదీన మోడీ కేబినెట్ దీన్ని ఆమోదించింది. రుణం కోసం 2017 ఏప్రిల్ 14న ఒప్పందం కుదుర్చుకుంది. కాలపరిమితి సమీపిస్తుండడంతో దీని వేగవంతానికి బిజెపి ప్రభుత్వం అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకూ ప్రాజెక్టు అమలుపై ఆదేశాలు జారీ చేసింది.కేంద్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా హైడ్రాలజీ ప్రాజెక్టును త్వరిగగతిన పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. రాష్ట్రంలోని ప్రతి మండలం నుంచి ఒక్కొక్క గ్రామం చొప్పున ప్రతిపాదనలు పంపాలని భూగర్భ జలశాఖ అధికారులను కోరింది. అందుకనుగుణంగా అధికారులు జాబితాలు రూపొందించి పంపుతున్నారు. పంటల సాగుకు రైతులు ఎంత మొత్తంలో నీటిని వినియోగిస్తున్నారో తెలుసుకునేందుకేనని అధికారులు పైకి చెప్తున్నా, నీటి వాడకానికి పరిమితి విధించి, అంతకు మించి వాడితే డబ్బులు వసూలు చేసే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పరిశ్రమలు కూడా డిజిటల్ ఫ్లో మీటర్లు ఏర్పాటు చేసుకోవాలని ఇప్పటికే ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చినట్లు సమాచారం. రోజుకు రెండు లక్షల లీటర్ల కంటే ఎక్కువ నీటిని తోడితే ప్రతి అదనపు లీటరుకూ ధర నిర్ణయించి వసూలు చేయనున్నట్లు సమాచారం. జిల్లాకు చెందిన నాగార్జున అగ్రికెమ్ లిమిటెడ్ పరిశ్రమ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సి.వి రాజులు వద్ద ప్రస్తావించగా, పరిశ్రమలకు ఫ్లో మీటరు బిగించుకోవాలని నోటీసులు ఇస్తారన్న విషయం తమకూ తెలిసిందన్నారు.వ్యవసాయ బోర్లకు డిజిటల్ ఫ్లో మీటర్ల ఏర్పాటుకు ప్రతి మండలం నుంచి ఒక్కొక్క గ్రామాన్ని ఎంపిక చేసి జాబితాను ప్రభుత్వానికి పంపాం. ప్రభుత్వం నుంచి తదుపరి ఆదేశాలు రాగానే రైతుల అంగీకారంతో వీటిని బిగిస్తాం. భూగర్భ జలాల్లో హెచ్చుతగ్గులు, రైతులు ఎంత మొత్తంలో నీటిని వినియోగిస్తున్నారో తెలుసుకునేందుకు ఈ మీటర్లను బిగించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

# కోడి ఈకలు, చేప పొలుసు వాయు కాలుష్యం నివారణ

అమరావతి అక్టోబర్ 2 కోడి ఈకలు వాయు కాలుష్యం నివారణలో ఉ పయోగపడతాయని యశస్వి నిరూపించింది. కోడి ఈకలు, చేప పొలుసు వంటి వ్యర్థాలను పర్యావరణ హితంగా మార్చి వివిధ వస్తువుల తయారీకి శ్రీకారం చుట్టింది విజయవాడ విద్యార్థిని మట్ల యశస్వి. ఈ ఈకలను డిస్క్ మాదిరిగా చేసి ఫ్యాక్టరీ పొగ గొట్టాలు, వాహనాల సైలెన్సర్ల వద్ద ఉంచినప్పుడు కాలుష్యం తగ్గింది. అంతేకాకుండా కోడి ఈకలు, చేప పొలుసు, నీరు, గ్లిసరిన్ కలిసి వేడి చేస్తే బయో ప్లాస్టిక్ తయారవుతోంది. ఇది సులభంగా మట్టిలో కలిసిపోయి ఎరువుగా కూడా ఉపయోగపడుతుంది. చేప పొలుసును నీటితో కలిపి వేడి చేస్తే ఫిష్ జెల్ తయారవుతోంది. దీనిని ఐరన్ రాడ్లకు పూస్తే తుప్పు పట్టకుండా నివారిస్తోంది. మోకాళ్ల నొప్పులకు సంబంధించి కార్టిలేజ్ ట్రీట్‌మెంట్‌లో చేపల పొలుసులు ఉపయోగపడనున్నాయి. ఇందులో కొలాజిన్ అనే పదార్థం ఉండటం వల్ల ఈ జెల్‌ను ఉపయోగిస్తే నొప్పి నుంచి ఉపశమనం పొందవచ్చు. పెయింట్ వేసేటప్పుడు ఈ జెల్‌ను కలిపి వాడితే గోడలకు చెమ్మ రాకుండా, పెచ్చులూడకుండా నివారించవచ్చు.ఈ వినూత్న ఆలోచనకు జాతీయ స్థాయిలో ఇన్‌స్పైర్ అవార్డు వరించింది. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా యశస్వి ఈ అవార్డును అందుకోనుంది. ఈ ప్రాజెక్ట్ అంతర్జాతీయ పోటీలకు సైతం నామినేట్ అయింది. గత ఏడాది పదో తరగతి చదువుతున్నప్పుడు యశస్వి దీనిని రూపొందించింది.

**కోడి ఈకలు, చేప పొలుసు, నీరు, గ్లిసరిన్ కలిసి వేడి చేస్తే**
**బయో ప్లాస్టిక్ తాయారు**
**మోకాళ్ల నొప్పులకు ఫిష్ జెల్**
**రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా యశస్వి ఈ అవార్డును అందుకోనుంది**

ప్రస్తుతం ఆమె ఇంటర్మీడియెట్ ఫస్టియర్ చదువుతోంది. కోడి ఈకలలోని కొలాజిన్, చేపల పొలుసులోని కెరోటిన్‌లతో పర్యావరణ హితమై భూమిలో కలిసిపోయే బయో ప్లాస్టిక్, తేలికపాటి సిమెంట్ ఇటుకలు, బయో ఎరువులు, పెయింట్‌ల వినియోగంలో పెచ్చులూడి పోకుండా చేయడం, వాహనాల ద్వారా వచ్చే వాయు కాలుష్యాన్ని తగ్గించడం,

కొలాజిన్ వినియోగంతో ఐరన్ తుప్పు పట్టే గుణం తగ్గడం, కార్టిలేజ్ ట్రీట్‌మెంట్ వంటి వాటిపై పరిశోధనలు చేసిన యశస్వి వాటిని శాస్త్రీయంగా నిరూపించింది. కోడి ఈకలు, చేప పొలుసును సిమెంట్, ఇసుక, నీటితో కలిపి తేలికగా ఉండే సిమెంట్ ఇటుకలను తయారు చేసింది. ఈ ఇటుకలను ల్యాబ్‌లో పరిశీలించగా బలంగానే ఉన్నాయని నిరూపణ అయ్యింది.

# జనంలోకి జనసేనాని

విజయవాడ, అక్టోబరు 2, (న్యూస్ పల్స్)జనసేన అధినేత పవన్ కల్యాణ్ పార్టీ నిర్మాణంపై దృష్టి పెట్టనున్నారు. పూర్తి స్థాయిలో పార్టీని ప్రక్షాళన కూడా చేయాలని నిర్ణయించారు. నమ్మకమైన నేతలకు ఇక పదవులు ఇవ్వాలని పవన్ కల్యాణ్ నిర్ణయించారు. జిల్లాలు, నియోజకవర్గాల వారీగా గత ఏడేళ్లుగా తన వెన్ంనటి నడుస్తున్న వారికే పదవులు ఇవ్వాలని పవన్ కల్యాణ్ డిసైడ్ అయ్యారు. తనను నమ్మించి వచ్చిన కొందరు నేతలు పార్టీని వదిలేసి వెళ్లిపోవడంతో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది.జనసేనలో పదవులు ఇచ్చిన మాదాసు గంగాధరం, జేడీ లక్ష్మీనారాయణ వంటి వారు పార్టీని వదిలి వెళ్లిన సంగతి తెలిసిందే. వీరితో పాటు మరికొందరు జిల్లా స్థాయి నేతలు కూడా పార్టీని వదిలి వెళ్లారు. వారిని నమ్మి పార్టీలో తీసుకుని కీలక పదవులను పవన్ కల్యాణ్ ఇచ్చారు. కానీ కష్టకాలంలో వదలి వెళ్లడంతో ఇకపై పార్టీ పదవులు లాయల్టీ ఉన్న వారికే ఇవ్వాలని పవన్ కల్యాణ్ డిసైడ్ అయ్యారంటున్నారు.రానున్న ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపిక కూడా ముందుగానే చేయాలని డిసైడ్ అయ్యారు. తమకు బలమున్న ప్రాంతాల్లో ముందుగానే అభ్యర్థులను ఎంపిక చేయడం వల్ల అడ్వాంటేజీ ఉ ంటుందని, ప్రజల్లోకి వెళ్లి పనిచేసుకోగలుగుతారని పవన్ కల్యాణ్ భావిస్తున్నారు. అందుకే తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ప్రకాశం జిల్లాల్లో కొన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థుల ఎంపికపై ఆయన త్వరలోనే స్పష్టత ఇవ్వనున్నారు.దీంతో పాటు జిల్లా, మండల, గ్రామ స్థాయిలో పార్టీని బలోపేతం చేయడం కోసం కొన్ని కార్యక్రమాలను కూడా రూపొందించాలని నిర్ణయించారు. బీజేపీతో సంబంధం లేకుండా పార్టీ కార్యాచరణ ప్రణాళికను తయారు చేయనున్నారు. దీనివల్ల జనసేన జెండా జనంలోకి వెళుతుందని పవన్ కల్యాణ్ భావిస్తున్నారు. దసరా తర్వాత జిల్లా, మండల స్థాయి నేతలు పవన్ కల్యాణ్ సమావేశమయ్యే అవకాశముంది.

# ట్రబుల్ షూటర్ గా చినరాజప్ప



రాజమండ్రి, అక్టోబరు 2, (న్యూస్ పల్స్)తెలుగుదేశం పార్టీలో చినరాజప్ప కీలకంగా మారబోతున్నారు. ఆయన పార్టీకి, అధినేతకు నమ్మకమైన నేతగా కొనసాగుతున్నారు. చినరాజప్ప గతంలో విపక్షంలో ఉన్నప్పుడు కూడా జిల్లా పార్టీ అధ్యక్ష బాధ్యతలను చూశారు. సమర్థవంతంగా తన బాధ్యతలను నిర్వహించారు. అందుకే చినరాజప్పకు 2014 ఎన్నికల్లో చిన రాజప్పకు చంద్రబాబు ఏరికోరి పెద్దాపురం టిక్కెట్ ను ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఆయనకు కీలకమైన హోంమంత్రి పదవిని ఇచ్చారు.చినరాజప్పది మెతక స్వభావం. నెమ్మదిగా ఉంటూనే పనిని చక్క బెడతారన్న పేరుంది. ఆయనను ముఖ్యమైన విషయాల్లో చంద్రబాబు ఉ పయోగించుకుంటున్నారు. లోకేష్ తో కూడా మంచి సంబంధాలు కొనసాగించడం ఆయనకు ప్లస్ పాయింట్. 2019లో పెద్దాపురం నుంచి తిరిగి గెలిచిన చినరాజప్ప అధినాయకత్వానికి నమ్మిన బంటుగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల గోరంట్ల బుచ్చయ్య చౌదరి అలిగిన సమయంలోనూ చంద్రబాబు చినరాజప్పను వినియోగించుకున్నారు.త్రీమెన్ కమిటీని నియమించినప్పటికీ అందులో చినరాజప్ప గోరంట్ల బుచ్చయ్య చౌదరిని బుజ్జగించడంలోనూ, రాజీనామా చేయకుండా నిరోధించడంలోనూ చినరాజప్ప కీలక భూమిక పోషించారు. ఇప్పుడు తూర్పు గోదావరి జిల్లాలో వైసీపీ దూకుడు ఎక్కువగా ఉంది. అక్కడ పార్టీ నేతల మధ్య విభేదాలు ఎక్కువగా ఉన్నాయి. కొన్ని నియోజకవర్గాల్లో నాయకత్వ సమస్య పార్టీని ఇబ్బంది పెడుతుంది.ఈ సమయంలో చినరాజప్ప సేవలను వినియోగించుకోవాలని చంద్రబాబు డిసైడ్ అయ్యారని తెలుస్తోంది. నియోజకవర్గాల్లో నేతల మధ్య విభేదాలను పరిష్కరించే బాధ్యతను చినరాజప్పకు అప్పగించనున్నారని తెలిసింది. చినరాజప్ప అయతే స్మూత్ గా డీల్ చేస్తారని చంద్రబాబు భావిస్తున్నారు. అదే జిల్లాలో సీనియర్ నేత యనమల రామకృష్ణుడు ఉన్నప్పటికీ చినరాజప్పకు ప్రాధాన్యత ఇచ్చేందుకే చంద్రబాబు డిసైడ్ అయ్యారని తెలుస్తోంది.

# బద్వేలు బరిలోకి జనసేనాని

కడప, అక్టోబరు 2, (న్యూస్ పల్స్)జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఈసారి రాజీపడేందుకు సిద్ధంగా లేరు. బద్వేలు ఉప ఎన్నికలలో జనసేన నుంచి అభ్యర్థిని బరిలోకి దింపాలని నిర్ణయించారు. ఇప్పటికే బీజేపీతో పొత్తుతో జనసేన క్యాడర్ లో కొంత ఇబ్బంది ఎదురవుతుంది. తిరుపతి ఉప ఎన్నికల సమయంలోనూ జనసేన క్యాడర్ నుంచి వత్తిడి ఎదురయింది. అయినా తప్పనిసరి పరిస్థితుల్లో తిరుపతి ఉప ఎన్నికను బీజేపీకే వదిలేయాల్సి వచ్చింది.నిజానికి తిరుపతిలో జనసేన బలం ఎక్కువగా ఉంది. తిరుపతి, శ్రీకాళహస్తి వంటి నియోజకవర్గాల్లో బలిజ సామాజికవర్గం ఓట్లు ఎక్కువగా ఉండటంతో అప్పట్లో జనసేన నుంచి పోటీ చేయాలని పవన్ కల్యాణ? కూడా భావించారు. తిరుపతి లో జరిగిన కార్యకర్తల సమావేశంలో క్యాడర్ కు కూడా హామీ ఇచ్చారు. కానీ పార్లమెంటు ఎన్నిక కావడంతో కేంద్ర నాయకత్వం జోక్యంతో దానిని బీజేపీకే వదిలేయాల్సి వచ్చింది.ఇక ఇప్పుడు బద్వేలు ఉప ఎన్నికను కూడా బీజేపీకే వదిలేస్తే క్యాడర్ లో తప్పుడు సంకేతాలు వెళతాయని పవన్ కల్యాణ్ భావిస్తున్నారు. అందుకే రాష్ట్ర బీజేపీ నేతలకు కూడా కుండబద్దలు కొట్టినట్లు చెప్పారని తెలిసింది. బద్వేలులో మాత్రం జనసేన అభ్యర్థి బరిలో ఉంటారని, ఇందులో వెనక్కు తగ్గడం ఏమీ ఉండదని ఆయన బీజేపీ నేతలకు చెప్పినట్లు సమాచారం. బీజేపీ నేతలు కూడా తాము కేంద్ర నాయకత్వంతో చర్చించి చెబుతామని వెళ్లినా, వారు కూడా జనసేనకే వదిలేస్తే బెటరన్న ధోరణిలో ఉన్నారు.బద్వేలులో గెలుపోటములు పక్కన పెడితే సీమ ప్రాంతంలో పార్టీ క్యాడర్ లో తిరిగి జోష్ నింపేందుకు ఈ ఉప ఎన్నిక ఉ పయోగపడుతుందని భావిస్తున్నారు.

## మరో ఇద్దరు కండువా మార్చేస్తారా...

విజయవాడ, అక్టోబరు 2, (న్యూస్ పల్స్)ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు మరోసారి హీటెక్కబోతున్నాయి. అధికార వైసీపీ తిరిగి ఆపరేషన్ ఆకర్ష్ కు తెరలేపిందని సమాచారం. స్థానిక సంస్థల ఎన్నికల్లో సంపూర్ణ మెజారిటీ సాధించడంతో టీడీపీని మరిత బలహీనం చేయాలన్న లక్ష్యంతో అధికార వైసీపీ ఉంది. ఇందుకోసం కొందరు ఎమ్మెల్యేలతో సంప్రదింపులు ప్రారంభమయినట్లు సమాచారం. త్వరలోనే కొందరు టీడీపీ ఎమ్మెల్యేలు వైసీపీకి మద్దతు తెలిపే అవకాశముంది. 2019లో తెలుగుదేశం పార్టీ నుంచి 23 మంది శాసనసభ్యులు విజయం సాధించారు. ఇందులో నలుగురు టీడీపీ ఎమ్మెల్యేలు వైసీపీకి మద్దతు తెలిపారు. కమ్మ సామాజికవర్గానికి చెందిన కరణం బలరాం, వల్లభనేని వంశీ పార్టీని వీడడం టీడీపీకి పెద్ద ఎదురుదెబ్బ. అలాగే మద్దాలి గిరి, వాసుపల్లి గణేష్ కుమార్ లు పార్టీని వీడి వైసీపీకి మద్దతుదారులుగా నిలిచారు. వీరి బాటలోనే మరో ఇద్దరు ఎమ్మెల్యేలు వైసీపీకి చేరువవుతారని సమాచారం.రాష్ట్రంలో వైసీపీ స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలతో మరింత బలపడింది. దీంతో కొందరు టీడీపీ ఎమ్మెల్యేలు వైసీపీ వైపు చూస్తున్నారని తెలిసింది. వచ్చే ఎన్నికల్లోనూ తమకే ఈ నియోజకవర్గం టిక్కెట్ ఇవ్వడంతో పాటు మరికొన్ని షరతులు కూడా ఆ ఎమ్మెల్యేలు వైసీపీ నాయకత్వం ముందు ఉంచుతున్నట్లు తెలిసింది. అయితే బేషరతుగా చేరాలని, వైసీపీలో ఉంటే భవిష?యత్ ఉంటుందని సీనియర్ నేతలు చెబుతున్నారట. ఉత్తరాంధ్ర ప్రాంతానికి చెందిన ఒక ఎమ్మెల్యే వైసీపీ లో చేరేందుకు సిద్ధమయ్యారని తెలిసింది. తన నియోజకవర్గంలో వైసీపీ మరింత బలపడటం దీనికి కారణం. అలాగే కోస్తా ప్రాంతానికి చెందిన మరో టీడీపీ ఎమ్మెల్యే కూడా వైసీపీకి మద్దతు పలికేందుకు సిద్ధమయ్యారని సమాచారం. ఇక వలసలు ఉండవులే అనుకుంటున్న చంద్రబాబుకు జగన్ త్వరలో షాక్ ఇవ్వనున్నారు. దసరాకు ముందే ఇద్దరు టీడీపీ ఎమ్మెల్యేలు వైసీపీలో చేరతారంటున్నారు.

## రాజకీయ సన్యాసం తీసుకుంటున్న జేసీ



అనంతపురం, అక్టోబరు 2, (న్యూస్ పల్స్)జేసీ దివాకర్ రెడ్డి ఎప్పుడూ బ్యాలన్స్ తప్పి మాట్లాడుతుంటారు. ఆయన అధికారంలో ఉన్నప్పుడు ఒకలా, లేనప్పుడు మరోలా వ్యవహరిస్తారు. ఇప్పుడు జేసీ కుటుంబం అధికారానికి దూరమయింది. పార్టీ కూడా వారిని దూరం పెట్టింది. దీంతో జేసీ దివాకర్ రెడ్డి లో వైరాగ్యం కన్పిస్తుంది. సమాజం, రాజకీయం అంతా చెడిపోయిందంటూ వేదాంత ధోరణికి వచ్చేశారు. జేసీ బ్రదర్స్ కు అధికారంలో ఉన్నప్పుడు సమాజం, రాజకీయం అనేవి కనపడలేదా? అని ప్రశ్నిస్తున్నారు.దశాబ్దాల కాలాల నుంచి జేసీ దివాకర్ రెడ్డి రాజకీయాలు వెలగపెడుతున్నారు. ఆయన అధికారంలో ఉన్నప్పుడు ప్రజాస్వామ్యం పరిఢవిల్లినట్లు బిల్డప్ ఇస్తున్నారు. ఇప్పుడు రాజకీయం ఏమాత్రం బాగా లేదంటున్నారు. సమాజం కూడా పూర్తిగా చెడిపోయిందన్న ధోరణికి వచ్చేశారు. చెడిపోయింది సమాజమా? లేక జేసీ రాజకీయమా? అన్న కామెంట్స్ బలంగా విన్పిస్తున్నాయి. దశాబ్దకాలాల వరకూ శాసించిన తాడిపత్రిని కోల్పోవడంతోనే జేసీ బ్రదర్స్ కు మతి చెల్లించిందన్న కామెంట్స్ వినపడుతున్నాయి.జేసీ దివాకర్ రెడ్డి కి ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ తో పాటు అక్కడి రాజకీయాలు కూడా పడటం లేదు. ఇటు అధికారంలో ఉన్న వైసీపీ ఇబ్బందులు పెట్టడం, అటు సొంత పార్టీ అయిన టీడీపీలో తమకు మద్దతు కరువవ్వడంతో ఏపీని వదిలి తెలంగాణకు వస్తానని వ్యాఖ్యానించారు. అది సాధ్యమయ్యే పనేనా? తమకు పట్టున్న తాడిపత్రి ప్రాంతాన్ని వదిలి జేసీ కుటుంబం తెలంగాణకు షిఫ్ట్ అవుతామని చెప్పడం ఎవరిని బెదిరించడానికి?జేసీ దివాకర్ రెడ్డి రాజకీయాల నుంచి తప్పుకున్నారు. వారి వారసులే ఇప్పుడు కొనసాగుతున్నారు. ఇప్పుడు అనంతపురం జిల్లాలో టీడీపీ పరిస్థితి ఏమాత్రం బాగా లేదు. వైసీపీ దెబ్బకు వచ్చే ఎన్నికల్లోనూ అక్కడ నెగ్గుకు రావడం కష్టమే. మొన్నటి ఎన్నికల్లోనే దారుణ ఓటమిని చవి చూసిన జేసీ దివాకర్ రెడ్డి కుటుంబం టీడీపీ పట్టు సాధించేందుకు ఈ రకమైన వ్యాఖ్యలు చేశారా? అన్నది స్పష్టమవుతుంది. టీడీపీ అధినాయకత్వాన్ని బెదిరించేందుకే జేసీ దివాకర్ రెడ్డి ఈ కామెంట్స్ చేశారంటున్నారు. మొత్తం మీద జేసీలో వేదాంత ధోరణి తాత్కాలికమే. పొలిటికల్ గా రైజ్ అయిన వెంటనే ఆయనకు రాజకీయాలు, సమాజం అందంగా కన్పించవచ్చు.

## ఇంటింటికీ మొక్క- ఊరంతా వనమవ్వాలి

**జి ఓ ,ఎన్ జి ఓ నోడల్ అధికారి మహేంద్ర రెడ్డి**

నెల్లూరు అక్టోబరు 2, (న్యూస్ పల్స్) గాంధీ జయంతి సందర్భముగా సెట్నెల్, జిఓ ఎన్జీఓ, ది పీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుజబుజనెల్లూరు, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నందు మొక్కలు నాటడం మరియు ఇంటింటికీ మొక్కలు పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిఓ ఎన్జీఓ నోడల్ అధికారి డా.ఎ మహేంద్ర రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇంటింటికీ మొక్క, ఊరంతా వనం కావాలని ,ఈ నెలంతా పీఎంపీల సహకారంతో గ్రామాల్లో ఇంటింటికీ మొక్కల పంపిణీ చేస్తున్నామని తెలిపారు. భూమిపై ఆరోగ్యకరమైన మరియు సంతోషకరమైన జీవితం కోసం చెట్లు ఎంతో అవసరమని అన్నారు. వివిధ అంశాలలో మనుషుల జీవితం, జంతువుల జీవితం చెట్లపై ఆధారపడి ఉంటుందన్నారు. నేటి మొక్కలు రేపటి చెట్లు,వృక్షాలని. మొక్కలు నాటడం చాలా సులభమని, దానికి నీరుపోసి,పెంచి పోషించడమే లక్ష్యంగా పెట్టుకొని మొక్కలు పెంచి, ఊరంతా వనం చేసినప్పుడే వాతావరణ సమతుల్యత చేకూరి అందరూ ఆరోగ్యంగా జీవించగలరని తన అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు.

### హెల్ప్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ జయంతి

బేతంచెర్ల బేతంచర్ల పట్టణంలోని "హెల్ప్" స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ152వజయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమాన్ని హెల్ప్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు దస్తగిరి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న బేతంచెర్ల జర్నలిస్టు సొసైటీ అధ్యక్షుడు వెంకటేశ్వర గౌడ్, సమాచార హక్కు చట్టం సభ్యుడు డి.ఎల్. ఎన్ శాస్త్రి మొదటగా మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అని ఆయనను కొనియాడారు ప్రతి ఒక్కరూ ఆయన అడుగుజాడల్లో నడవాలని కోపం, ఆవేశాలతో కాకుండా శాంతి మార్గం లోనే నడిచి భారతదేశాన్ని ఉన్నత స్థానంలో నిలపాలని వారు ఈ సందర్భంగా యువతకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హెల్ప్ స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు గూటం భగవాన్, పి. ఎండి. భాష, గౌరవ అధ్యక్షుడు డాక్టర్ నూర్ అహ్మద్, ఉపాధ్యక్షుడు డాక్టర్ జయంతి గౌడ్, కోశాధికారి అహ్మద్ సభ్యులు డాక్టర్ భాష, హనుమంత రెడ్డి , జర్నలిస్ట్ మద్దిలేటి, రమణారెడ్డి, మురళి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# మహాత్మా గాంధీజీకి ఘన నివాళులు




**గాంధీజీ మార్గం అనుసరణీయం**

**మహాత్మా గాంధీజీ పుట్టిన రోజు సందర్భంగా ప్లాస్టిక్ హటావో....కర్నూల్ బచావో కార్యక్రమం శ్రీకారం**

**జిల్లా కలెక్టర్ పి. కోటేశ్వర రావు**

కర్నూలు, అక్టోబర్ 02 జాతిపిత మహాత్మ గాంధీ చూపిన మార్గాన్ని మనమందరం అనుసరించాలని జిల్లా కలెక్టరు పి. కోటేశ్వర రావు అన్నారు. శనివారం కలెక్టరేట్ సమీపంలోని జాతిపిత మహాత్మా గాంధీ జయంతి పురస్కరించుకొని మహాత్మ గాంధీ విగ్రహనికి జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వర రావు, జాయింట్ కలెక్టర్ (రెవిన్యూ మరియు రైతు భరోసా) రామ సుందర్ రెడ్డి, కర్నూలు నగర పాలక సంస్థ కమిషనర్ డి.కె బాలాజీ, డి ఆర్ ఓ పుల్లయ్య, వి రామ్ గోపాల్ చౌదరి ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రెసిడెంట్ వై రామేశ్వర్ రెడ్డిలు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. జాతిపిత మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా కలెక్టరేట్ సమీపంలోని గాంధీ విగ్రహం దగ్గర మహాత్మాగాంధీ, చాచా నెహ్రూజి వివిధ దేశ నాయకుల వేషధారణలో ఉన్న పాఠశాల విద్యార్థులతో జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు, జాయింట్ కలెక్టర్ (రెవెన్యూ మరియు రైతు భరోసా) రామ సుందర్ రెడ్డిలు కలిసి ఫోటోలు దిగి వారితో ముచ్చటించారు.అనంతరం కలెక్టరేట్లోని గాంధీ విగ్రహం సమీపంలో కర్నూల్ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో 75 స్వతంత్ర భారత మహోత్సవాలులో భాగంగా జగనన్న స్వచ్ఛ సంకల్పం ప్లాస్టిక్ హటావో....కర్నూల్ బచావో అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్లాస్టిక్ బాటిల్ వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ పడేయకుండా బాధ్యతగా ప్లాస్టిక్ బాటిల్ వ్యర్థాలకు సంబంధించిన వాటిని మున్సిపల్ కార్మికులకు జిల్లా కలెక్టర్ అందజేశారు. జిల్లా కలెక్టర్ బాధ్యతగా ప్లాస్టిక్ వ్యర్థాలను సమీకరించి మున్సిపల్ కార్మికులకు అందజేయడంతో కర్నూల్ మున్సిపాలిటీ కమిషనర్ జిల్లా కలెక్టర్ కు సర్టిఫికెట్ అందజేశారు. జిల్లా కలెక్టర్ పి కోటేశ్వర రావు మాట్లాడుతూ... భారతదేశ స్వాతంత్ర్యానికి పోరాడిన గొప్ప వ్యక్తి మహాత్మా గాంధీజీ అన్నారు. జాతిపిత మహాత్మా గాంధీ జయంతి పురస్కరించుకొని జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నామన్నారు. సత్యం, అహింస గాంధీజీ నమ్మే సిద్ధాంతలు అయితే, సహాయ నిరాకరణ, సత్యాగ్రహం ఆయన ఆయుధాలు అన్నారు. మహాత్మా గాంధీజీ గారు ప్రతిపాదించిన సిద్ధాంతాలను మాటల్లో చెప్పుకోవడం కాకుండా, ప్రతి పౌరుడు ఆచరణలో పెడితే గాంధీజీ కలలు కన్న మన రాజ్యాన్ని నిర్మించుకోవడం జరుగుతుందన్నారు. అందులో భాగంగానే కర్నూలు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ హటావో-కర్నూల్ బచావో అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మన కర్నూలు నగరాన్ని గాంధీ జయంతి రోజున ఉత్తేజితం చేసుకోవడానికి ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. ప్రజలందరూ, అధికారులు, ప్రజా ప్రతినిధులు వారి ఇళ్లలో ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాల్ని తీసుకొచ్చి ఇక్కడికొచ్చి మున్సిపాలిటీకు ఇస్తే వారికి సర్టిఫికెట్ కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇలా చేయడం వల్ల ప్రజల్లో మరింత బాధ్యత పెరిగి వారికి ప్రోత్సహించిన వారమవుతాము అని వినూత్నంగా చేస్తున్నామన్నారు. ఈ రోజు గాంధీ జయంతి పుట్టిన రోజు సందర్భంగా ప్లాస్టిక్ వాడకం మరియు ప్లాస్టిక్ వ్యర్థాల ద్వారా పర్యావరణానికి కలిగే హానిని వీలైనంత తగ్గించే క్రమంలో కర్నూలు నగరాన్ని ప్లాస్టిక్ రహిత కర్నూలును శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు.

## జాతిపిత కలల సహకారం దిశగా సచివాలయాలు ఏర్పాటు

**నంద్యాల పార్లమెంట్ సభ్యులు పోచ బ్రహ్మానంద రెడ్డి**

.నంద్యాల అక్టోబర్ 2 -జాతిపిత కలల సహకారం దిశగా సచివాలయాలు ఏర్పాటు చేసుకున్నాము అన్ని నంద్యాల పార్లమెంట్ సభ్యులు పోచ బ్రహ్మానంద రెడ్డి అన్నారు. శనివారం 152 వ మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా నంద్యాల పట్టణంలోని టౌన్ హాల్ నందు సచివాలయ ద్వితీయ వార్షికోత్సవాని. మరియు క్లప్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి నంద్యాల పార్లమెంట్ సభ్యులు పోచ బ్రహ్మానంద రెడ్డి. మార్కెట్ యార్డ్ చైర్మన్ ఇ షాక్ బాషా .మున్సిపల్ చైర్ పర్సన్ మాబున్నిసా. మున్సిపల్ వైస్ చైర్మన్ లు గంగిశెట్టి వెంకట నాగ శ్రీధర్. జంగం పంషా వలి. మున్సిపల్ కమిషనర్ వెంకటకృష్ణ లు హాజరైనారు. నంద్యాల పార్లమెంట్ సభ్యులు పోచ బ్రహ్మానంద రెడ్డి. మున్సిపల్ చైర్ పర్సన్ షేక్ మాబున్నిసా. మున్సిపల్ కమిషనర్ వెంకటకృష్ణ లు మాట్లాడుతూమన రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సచివాలయ వ్యవస్థ నేటికి రెండు సంవత్సరములు అయినదని ఈ సచివాలయ వ్యవస్థ ద్వారా నంద్యాల పట్టణంలో 36 సంక్షేమ పథకాలకు 545 రకాల సేవలు అందిస్తున్నామని అన్నారు. మన రాష్ట్ర ప్రభుత్వం క్లీన్ గ్రామాలు క్లీన్ మున్సిపాలిటీలు క్లీన్ ఆంధ్ర స్వచ్ఛ భారత్ లక్ష్యంగా మన ప్రభుత్వం చేపడుతున్న టువంటి మహా యజ్ఞమే ఈ జగనన్న స్వచ్ఛ సంకల్పం అన్నారు. గౌరవ ముఖ్యమంత్రి .ఇంటి ముందు ప్రభుత్వం కంటి ముందు పాలన ఆనే విధంగా ఈ సచివాలయంలో ఏర్పాటు చేసి ప్రతి గ్రామంలోనూ ప్రతి మున్సిపాలిటీ లోనూ గ్రామ సచివాలయ లను వార్డు సచివాలయ లను ఏర్పాటు చేసి ఉన్నారన్నారు. ఈ సచివాలయాల ద్వారా ప్రజలందరూ వారివారి ప్రాంతాలనుండి వారి సమస్యలను మరియు ప్రభుత్వం ప్రవేశపెట్టిన టువంటి సంక్షేమ పథకాలను సచివాలయాల నుండి పొందవచ్చునన్నారు ప్రజల సమస్యలను కూడా ప్రతిరోజు సాయంకాలం నాలుగు గంటల నుండి 5 గంటల వరకూ వినతులను స్వీకరించి సత్వర పరిష్కారాలు కూడా చేపడుతున్నారు. మన రాష్ట్ర ప్రభుత్వం గ్రామాలను నగరాలను పరిశుభ్రంగా మార్చుటకు అన్ని గ్రామాల పట్టణాల నందు ఉచిత డస్ట్ బిన్ లిచారని ఇచ్చినటువంటి 3 డస్ట్ బిన్ లలో తడి చెత్త. పొడి చెత్త. ప్రమాదకరమైన వ్యర్థాలు వేయాలన్నారు. ఈ కార్యక్రమం శాశ్వతముగా స్థిరంగా. నిరంతరాయంగా కొనసాగించు కోవాలని అన్నారు. అనంతరం మన జాతిపిత మహాత్మా గాంధీ దేశానికి చేసినటువంటి సేవలను గురించి హాజరైన వారికి పూర్తి విశదంగా వివరించారు. ఈ కార్యక్రమంలో నంద్యాల సి డి పి ఓ చంద్రకళ తహసిల్దార్ రవికుమార్ వార్డ్ కౌన్సిలర్ లు కో ఆప్షన్ మెంబర్లు డాక్టర్ సుజాత. మండల విద్యాశాఖ అధికారి బ్రహ్మం మెప్మా సి యమ్ యమ్ విజయ భాస్కర్ రెడ్డి. సచివాలయ సిబ్బంది . వాలంటీర్లు. మున్సిపల్ ఇంజనీర్ రమణ డిఈ మధు తదితరులు పాల్గొన్నారు.

## మహాత్ములకు ఘన నివాళులు అర్పించిన తిరుపతి అర్బన్ జిల్లా యస్.పి

తిరుమల,మా ప్రతినిధి ,అక్టోబర్ 02 జాతిపిత మహాత్మా గాంధీ 152 వ జయంతి, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా ఈ రోజు తిరుమల పోలీస్ కాంప్లెక్స్ నందు జిల్లా యస్.పి వెంకట అప్పల నాయుడు,మహాత్ముల చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా యస్.పి మాట్లాడుతూ అహింసనే ఆయుధంగా చేసుకుని బ్రిటిష్ వారిని ఎదిరించి, శాంతియుతంగ పోరాడి దేశానికి స్వాతంత్రాన్ని అందించి చరిత్రలోనే గొప్ప వ్యక్తిగా, జాతిపితగా నిలిచారని కొనియాడారు. మహాత్మా గాంధీ చేసిన ఉద్యమాలు, సంస్కరణలు గుర్తుచేశారు. అలాంటి మహనీయుని ఆలోచనలు, సంస్కరణలు మన అందరికీ ఆదర్శప్రాయమని ఆయన అడుగుజాడల్లో అందరూ ముందుకు సాగాలని భారత దేశానికి స్వాతంత్ర్యాన్ని తీసుకొవచ్చిన మహాత్మ గాంధీజి ప్రపంచానికే ఆదర్శనీయమన్నరు దేశ అభివృద్ధికి గ్రామాలే పట్టుకొమ్మలు అనే గాంధీజి ఆశయాలతో గ్రామాల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతుందీ.గాంధీజి గారి అడుగు జాడలను, అందించిన సేవలను మనమందరం ఒక స్పూర్తిగా తీసుకుని ముందుకు వెళ్లాలనీ తెలిపేరు. మానవ సేవయే - మాధవ సేవ అని తెలిపారు. అక్టోబర్ 2 అంటే మహాత్మ గాంధీ గారి పుట్టిన రోజుగా మాత్రమే అందరూ గుర్తు పెట్టుకుంటారు. కానీ అదే రోజు భరతమాత కన్న మరో మహా నాయకుడు లాల్ బహదూర్ శాస్త్రి పుట్టినరోజు కూడా. ఏది ఏమైనా, మనం మరుపురాని రోజుగా గాంధీ జయంతిని పండుగగా జరుపుకునే అక్టోబర్ 2న మన దేశానికి రెండవ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి గారి జన్మదినం కూడా. నెహ్రూ మరణం తర్వాత లాల్ బహదూర్ శాస్త్రి భారత రెండవ ప్రధానిగా పదవి బాధ్యతలు చేపట్టారు. కాకిలా కలకాలం జీవించే కంటే హంసలా కొద్ది కాలం జీవించారు శాస్త్రిగారు. ప్రధానిగా కొంతకాలమే ఉన్న భారతీయ యవనికపై లాల్ బహుదూర్ శాస్త్రి తనదైన ముద్ర వేశారు. అదే ఆయన్ని ధృడమైన నాయకునిగా మన ముందు నిలబెట్టాయి. 1965 భారత్-పాకిస్థాన్ యుద్ధం సందర్భంగా ఆయన ప్రదర్శించిన అసమాన ధైర్యసాహసాలు, సంకల్పం, దీక్షా దక్షతలను ఎంత చెప్పుకున్నా తక్కువే. ముఖ్యంగా దేశానికి వెన్నుముకలైన రైతులను, సైనికులను ఉద్దేశించి ఆయన చేసిన నినాదం 'జై జవాన్..జై కిసాన్' దేశాన్ని ఒక్కటి చేసింది. పాకిస్థాన్‌పై విజయాన్ని సాధించిన ఆనందాన్ని దేశ ప్రజలతో పంచుకునే లోపే ఆయన దేశం కోసం ప్రాణాలు విడిచారని యస్.పి అన్నారు.

# కదులుతున్న తెలుగు అకాడమి డొంక




హైద్రాబాద్, అక్టోబరు 2, (న్యూస్ పల్స్)డొంక కదులుతోంది. నిధుల గోల్‌మాల్ వ్యవహారం కొలిక్కివస్తోంది. తెలుగు అకాడమిని నిండా ముంచేసిన అక్రమార్కుల గుట్టురట్టయ్యింది. ఈ కేసులో కీలక సూత్రధారుల్ని అరెస్ట్ చేశారు పోలీసులు. ఆకాడమీ పుస్తకాల మాటు అక్రమాలకు పాల్పడ్డ కేటుగాళ్ల అసలు భాగోతాన్ని వెలికితీస్తున్నారు. యూనియన్ బ్యాంక్ మేనేజర్ మస్తాన్ వలితో సహా ఏపీ మార్కంటైల్ మ్యూచ్‌వల్ ఎయిడెడ్ కో ఆపరేటివ్ సొసైటీ మేనేజర్ పద్మావతిని అరెస్ట్ చేశారు అటూ పోలీసులు. తెలుగు అకాడమీ నిధుల గల్లంతు వెనుక యూనియన్ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ మస్తాన్ వలీనే సూత్రధారిగా తేలింది. కార్వాన్ అండ్ సంతోష్‌నగర్ బ్రాంచ్‌ల నుంచి నిధులు దారి మళ్లిన సమయంలో మస్తాన్ వలీనే మేనేజర్‌గా ఉన్నాడు. కార్వాన్ బ్రాంచ్‌లో రూ. 43 కోట్లను దారి మళ్లించిన మేనేజర్ మస్తాన్ వలీ రెండు నెలల క్రితమే సంతోష్‌నగర్ బ్రాంచ్‌కు బదిలీపై వెళ్లాడు. అక్కడ కూడా రూ. 8 కోట్లను కాజేశాడు. ఇదే తరహాలో మరో మూడు బ్యాంకుల నుంచి రూ. 26 కోట్లు కొట్టేశాడు. చందానగర్ కెనరా బ్యాంక్ నుంచి మరో రూ. 9 కోట్లు.. రెండు కోఆపరేటివ్ బ్యాంకుల నుంచి రూ. 17 కోట్లు దాకా దోచేశాడు. తెలుగు అకాడమీ నిధుల గల్లంతు వ్యవహారం రోజుకో మలుపు తిరుగుతోంది. కాజేసిన నిధుల మొత్తం పెరుగుతోంది. యూనియన్ బ్యాంక్, కెనరా బ్యాంక్, ఆర్బీఎల్, అగ్రసేన్ బ్యాంక్ ఖాతాల నుంచి నిధులు దారి మళ్లినట్లు తేల్చారు. ఇప్పటివరకు జరిపిన విచారణలో మొత్తం కుంభకోణం విలువ రూ. 77కోట్లకు చేరింది. మరోవైపు ఇందుకు సంబంధించి సీసీఎస్ అధికారుల బృందం దర్యాప్తు ముమ్మరం చేసింది. మొత్తం 11 ప్రభుత్వ బ్యాంకులకు చెందిన 34 బ్రాంచిల్లో ఎఫ్‌డీల రూపంలో తెలుగు అకాడమీ నిధులు ఉన్నాయి. అయితే, యూనియన్ బ్యాంకు, కెనరా బ్యాంకుల్లోని డిపాజిట్లు మాయమైనట్లు తెలుగు అకాడమీ అధికారులు గుర్తించారు. అయితే, ఏ బ్రాంచ్‌లోనూ అకాడమీకి కరెంట్ అకౌంట్ లేదు. కరెంట్ అకౌంట్ తెరవకుండా నేరుగా ఎఫ్‌డీలు వేయడంతో వాటి వివరాలు బ్యాంకు లావాదేవీల రికార్డుల్లో కనిపించవు. దీన్నే ఆసరా చేసుకుని తెలివిగా ఉపయోగించుకున్న బ్రాంచ్ మేనేజర్ మస్తాన్ వలీ? తెలుగు అకాడమీ ఎఫ్‌డీలను వేరే బ్యాంకుకు వక్రమార్గంలో దారి మళ్లించి కాజేశాడుసీసీఎస్ పోలీసుల ఇంటరాగేషన్‌లో మస్తాన్ వలీ కీలక విషయాలు వెల్లడించినట్లు తెలుస్తోంది. ఏడాదికోసారి ఎఫ్‌డీలను అకాడమీ రెన్యువల్ చేస్తుంది. ఈ ఏడాది కాలంలో ఆ డబ్బును లాభసాటి వ్యాపారాల్లో పెట్టుబడి పెట్టి, ఎఫ్‌డీల గడువు సమీపించేలోపు తిరిగి యథావిధిగా బ్యాంకులో జమ చేయాలనుకున్నానని చెప్పినట్లు తెలుస్తోంది. దీంతో, దారి మళ్లించిన డబ్బును ఎక్కడెక్కడ పెట్టుబడులు పెట్టాడనే విషయాలను పోలీసులు ఆరా తీస్తున్నారు.

## కొత్త సినిమాలు చేస్తున్నా

తిరుమలఅక్టోబరు 2, (న్యూస్ పల్స్) కొత్త సినిమాలతో త్వరలో తెలుగు ప్రేక్షకుల ముందుకు వస్తానన్నారు కమెడియన్, హీరో సప్తగిరి. తిరుమల శ్రీవారిని దర్శించుకున్న సప్తగిరి ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడారు. శ్రీవారి దర్శనం ఎంతో అద్భుతంగా జరిగిందన్నారు. అందరూ బాగుండాలని శ్రీనివాసుని ప్రారంభించినట్లు చెప్పారు. త్వరలో గూడుపుఠాని, గోల్డ్ మాన్, 8 సినిమాలు విడుదల కాబోతున్నాయన్నారు. అలాగే మరో నాలుగు సినిమా ప్రాజెక్టులు తన చేతిలో ప్రస్తుతం ఉన్నాయన్నారు. మా ఎన్నికలపై మీడియా అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా హీరో సప్తగిరి వెళ్ళిపోయారు

## గ్రామాధికారుల నిర్బంధం

నూజివీడు అక్టోబరు 2, (న్యూస్ పల్స్) నూజివీడు మండలం మిట్టగూడెం గ్రామంలో సచివాలయంలో సెక్రటరీని,గ్రేడ్ 5 సెక్రటరీనీ సచివాలయంలో గ్రామస్తులునిర్బంధించారు. వాలంటీర్లు సంతకాలు లేకుండా టిడిపి నాయకులతో కుమ్మకు అయి పెన్షన్లు ఇస్తున్నారంటూ సిబ్బందిని వైఎస్ఆర్సీపీ నాయకులు నిర్భందించారు. గ్రామ సభ నిర్వహిస్తూ వైఎస్ఆర్సిపి నాయకులకు సమాచారం ఇవ్వలేదంటూగ్రామస్తులు ఆందోళనకు దిగారు. అధికారులు టిడిపి నాయకులతో కుమ్మక్కై మమ్మల్ని తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని వైఎస్సార్ సీపీ నాయకులు, గ్రామస్తులు అంటున్నారు. సెక్రటరీ, గ్రేడ్ 5 సెక్రటరీ పై చర్యలు తీసుకోవాలంటూ వైయస్సార్ సిపి నాయకులు,గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

## ఎట్టకేలకు కాణిపాకం దేవస్థానం పాలకమండలి ఏర్పాటు

కాణిపాకం అక్టోబరు 2, (న్యూస్ పల్స్) ఎట్టకేలకు స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి దేవస్థానం పాలకమండలి ఏర్పాటు అయింది. గత 3 సంవత్సరాలుగా వాయిదా పడుతూ వస్తున్న కాణిపాకం ఆలయ పాలకమండలి ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. వైసీపీ.ప్రభుత్వం ఏర్పడిన తరువాత కాణిపాకం ఆలయ పాలక మండలి ని ఏర్పాటు చేయాలని భావించి పలువురి పేర్లను ప్రభుత్వం పరిశీలించించి స్థానికులకు కాకుండా బయటి ప్రాంతాల వ్యక్తులను ఆలయ కమిటీ చైర్మన్ గా నియమించాలని భావించింది...కానీ కాణిపాకం ఆలయ ఉభయధారులుగా రాజకీయాల కు అతీతంగా ఉభయదారులుగా ఉన్న 14 గ్రామాలకు చెందిన వ్యక్తులనే పాలక మండలి అధ్యక్షుడిగా నియమించాలని ఒక్కతాటి పై రావడంతో ప్రభుత్వం దిగిరాక తప్పలేదు...ఈ క్రమంలో నిన్నటితో కాణిపాకం ఆలయ వార్షికోత్సవాలు ముగియడంతో ప్రభుత్వం హఠాత్తుగా 13 మంది సభ్యులతో పాలక మండలి ప్రకటించడంతో పాలకమండలి సభ్యులతో ఆలయ ఈఓ వెంకటేష్ ప్రమాణస్వీకారం చేయించారు. పాలక మండలి అధ్యక్షుడు గా కాణిపాకం ఆగరంపల్లి కి చెందిన వైసీపీ సీనియర్ నాయకుడు మోహన్ రెడ్డి ని ప్రభుత్వం నియమించింది..గతంలో మోహన్ రెడ్డి తండ్రి జగన్నాధ రెడ్డి కూడా ఆలయ పాలక మండలి అధ్యక్షులు గా పనిచేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే బాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి పరిసర గ్రామస్తులు పాల్గొన్నారు.

## శేరిలింగంపల్లిలో చీరల పంపిణీ

శేరిలింగంపల్లి పేద ప్రజలను ఆదుకోవడంలో తెలంగాణ ప్రభుత్వం ముందు ఉంటుందని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ గాంధీ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బతుకమ్మ పర్వదినంను పురస్కరించుకొని అక్టోబర్ 2 నుండి తెలంగాణ ఆడపడుచులకు సారె గా అందిస్తున్న బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథి గా పాల్గొని చీరలు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ గాంధీ మాట్లాడుతూ బతుకమ్మ పర్వదినం సందర్భంగా ఆడపడుచులకు సారెగా ఉచితంగా చీరలను అందచేసిన ముఖ్యమంత్రి కేసీఆర్ కు, మంత్రి కేటీఆర్ కు నియోజకవర్గ అడపడచుల తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేసారు. తెలంగాణ రాష్ట్ర లోని మహిళలు ముఖ్యంగా బతుకమ్మ పండుగను జరుపుకుంటారని రాష్ట్ర ప్రభుత్వం మహిళల గౌరవార్థం ఉచితం గా చీరల పంపిణి చేయడం జరిగింది అని ఈ బహుమతి రాష్ట్ర ప్రభుత్వం తరపున ఈ యొక్క చీరల పంపిణీకి నియోజక వర్గం లో పేద మహిళలకు అందించడం చాలా ఆనందం గా ఉంది అని ఆయన అన్నారు. బతుకమ్మ పండుగా ద్వారా తెలంగాణ సంప్రదాయాన్ని చాటి చూపిన ఘనత మన ప్రభుత్వం కే దక్కిందని అని తెలియచేసారు. శేర్లింగంపల్లి నియోజకవర్గంలో అర్హులైన మహిళలకు అందరికీ చీరలు అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. పేదలని అన్ని ఆదుకోవడంలో తెలంగాణ ప్రభుత్వం ముందు ఉంటుందని, షాదీ ముబారక్ కళ్యాణ లక్ష్మి ఇలాంటి ఎన్నో గొప్ప గొప్ప కార్యక్రమాలు చేపట్టడంలో తెలంగాణ ప్రభుత్వం ముందు ఉందని ఆయన అన్నారు.

## గాంధీతో గోదావరి ముద్రలు

రాజమండ్రి, అక్టోబరు 2, (న్యూస్ పల్స్)తూర్పుగోదావరి జిల్లాతో మహాత్మాగాంధీజీకి విడదీయలేని బంధం ఉంది. బాపు పాదముద్రలు జిల్లా అంతటా కనిపిస్తూ ఉంటాయి. అహింసే ఆయుధంగా కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ఉద్యమ స్ఫూర్తిని రగిలించిన బాపూజీ తూర్పుగోదావరి జిల్లా నేలపై కూడా అడుగులు వేశారు. కిలోమీటర్ల దూరం నడిచి స్వాతంత్ర్య కాంక్షను రగిలించారు. 1921, 1929, 1933, 1946లో జిల్లాలో పర్యటించి ఇక్కడి నేలను పునీతం చేశారు మహాత్మ.రాజమండ్రి టూ సీతానగరం ఆయన గుర్తులు కనిపిస్తూనే ఉంటాయి. అఖిల భారత కాంగ్రెస్ సమావేశంతో పాటు.. జిల్లాలో అనేక ప్రసంగాల్లో గాంధీజీ పాల్గొన్నారు. సహాయ నిరాకరణోద్యమంలో భాగంగా.. రాజమండ్రిలో సనాతన కుటుంబాలకు చెందిన 15 మందికి పైగా మహిళలు స్వాత్రంత్ర్య యోద్యమంలో పాల్గొన్నారు. వారంతా జైలు శిక్ష అనుభవించారని చరిత్ర చెప్తోంది. స్వరాజ్య నిధి సేకరణకు రాజమండ్రికి వచ్చిన గాంధీజీ.. 1921లో అప్పటి పాల్ చౌక్.. అంటే ఇప్పటి కోటిపల్లి బస్ స్టాండ్ సమీపంలో ప్రసంగించారు. 1929లో సీతానగరం గాంధీజీ కస్తూర్బా ఆశ్రమం తిలకించి ఎంతో మందికి స్వతంత్ర ఉద్యమానికి స్ఫూర్తినిచ్చారు గాంధీజీ. ఆయన ఆనవాళ్ళు ఇంకా ఆ ఆశ్రమంలో కనిపిస్తూనే ఉంటాయి. ఆ రోజుల్లో రాజమండ్రి మున్సిపాలిటీ సిబ్బంది కూడా గాంధీజీకి సన్మానాలు చేశారని చెప్తున్నారు చరిత్రకారులు.

## నగదు స్వాధీనాలు షురూ

బద్వేలు బద్వేలు రూరల్ సర్కిల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అట్లూరు క్రాస్ రోడ్ వద్ద ఎటువంటి అనుమతులు లేకుండా కారులో తీసుకు వెళుతున్న 22 లక్షల 50000 రూపాయల నగదును అట్లూరు ఎస్ఐ నాగ చిరంజీవ స్వాధీనం చేసుకున్నారు ఎన్నికల విధుల్లో భాగంగా భాగంగా అట్లూరు క్రాస్ రోడ్ లో ఏర్పాటుచేసిన చెక్ పోస్ట్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఒక కారులో అనుమతులు లేకుండా లేకుండా తీసుకు వెళుతున్న నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు తెలిపారు ప్రకాశం జిల్లా ఉలవపాడు మండలానికి చెందిన కోమట్ల వెంకటరావు కార్ డ్రైవర్ దుర్గాప్రసాద్ నగదు తరలిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు వారిద్దరిని ప్రభుత్వం విచారిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు

## గాంధీ జయంతి వేడుకలు ఘనంగా...



పగిద్యాల అక్టోబరు 2, (( విభారె) ) పగిద్యాల మండల పరిషత్ ఆధ్యక్షురాలు శ్రీ మతి మండ్ల మల్లీశ్వరి ఆద్వర్యంలో "152 గాంధి జయంతిని " పగిద్యాల మండల జెడ్పిటిసి శ్రీమతి పూల్యాల దివ్య మరియు మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు పల్లే అరుణమ్మ . పగిద్యాల గ్రామం సర్పంచ్ పేరుమల్ల భాస్కర్ మ ముఖ్య అతిదిలుగా పాల్గొన్నారు. కార్యక్రమం లొ మొదట ఎజూజూ మండ్ల మల్లీశ్వరి జాతిపిత మహత్మ గాంధి గారి పోటోకు పూలమాలవేసి ఆయనకు నివాళులు అర్పించి ఘనంగ జయంతి నిర్వహించారు. తదనంతరం పగిద్యాల మండల అధ్యక్షురాలు మండ్ల మల్లీశ్వరి మాట్లడుతు మహత్మ గాంధి గారు కలలుగన్న గ్రామ స్వరాజ్యని మన ప్రియాతమ ముఖ్యమంత్రి శ్రీ జూ జగన్ మొహన్ రెడ్డి తోటే సాధ్యమని అందుకు మన జగనన్న ప్రభుత్వం నిరుపేద కుటుంబలకు,అర్హత ఉన్న పెదల పెదరికని రుపుమాపటం కోసం నవ రత్నలను ప్రవేశపెట్టి పెదలకు సంక్షేమ ఫథకల అమలు దేశంలోనే ఆదర్శంగ మన ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగ నిలిచిందాని తేలియజేస్తు, ప్రజలకు పగిద్యాల మండల స్థాయిలొని గ్రామలకు సేవ చేసే బాగ్యం మన ప్రియాతమ ముఖ్యమంత్రి శ్రీ జూ జగన్ మొహన్ రెడ్డి గారు అలాగే ఆంధ్రప్రదేశ్ క్రీడా సాదికార సంస్థ ల చైర్మేన్ గౌరవనియులు శ్రీ బైరెడ్డి సిద్దర్థా రెడ్డి పగిద్యాల మండల అధ్యక్షురాలు అయినటువంటి నాకు ఈఅవకాశం కల్పించినందుకు నా వంతుగ గ్రామల ఆబివృద్దికి ఎనలేని కృషి చేస్తానని తేలుపుతు 152 "గాంధి జయంతి" శుభకాంక్షలు తేలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో పగిద్యాల మండలం వైసిపి నాయకులు పల్లె సత్యం రెడ్డి.యు ఓ ఆర్ డి ఫక్రుద్దీన్. ఎపిఎం శ్రీనివాసులు. సోషల్ మీడియా నాయకులు పేరుమల్ల సుధాకర్.

## కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జాతిపిత మహాత్మాగాంధీ వేడుకలు

నంద్యాలఅక్టోబరు 2, (( విభారె) ) నంద్యాల లో పి సి పి ప రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ చింతల మోహన్ రావు ఆదేశాల మేరకు– జాతిపిత మహాత్మా గాంధీ గారి 152వ జయంతిని పురస్కరించుకొని జాతీయ కాంగ్రెస్ పార్టీ నాయకులు మహాత్మా గాంధీ గారి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళు లు అర్పించారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు కాంగ్రెస్ పార్టీ నంద్యాల టౌన్ అధ్యక్షులు సుబ్బా గురుమూర్తి మాట్లాడుతూ మహాత్మా గాంధీ గారు సత్యం, శాంతి,అహింసలే ఆయుధాలుగా చేసుకుని స్వాతంత్రం సాధించడంలో విజయం సాధించారని తెలిపారు , గాంధీజీ సేవలను కొనియాడుతూ గాంధీజీ ఆశయాలు సాధించడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని తెలియజేశారు,

# ఘనంగా మహాత్మాగాంధీ 152 వ జయంతి



ఎమ్మిగనూరు అక్టోబరు 2, (( విభారె) పట్టణంలో జాతిపిత "మహాత్మా గాంధీ" గారి 152వ జన్మదినం పురస్కరించుకుని మహాత్మా గాంధీ విగ్రహానికి రైతు బాంధవుడు, శాసన సభ్యులు "ఎర్రకోట చెన్నకేశవరెడ్డి" గారి ఆదేశాలు మేరకు మన ప్రియతమ నాయకులు, పేదల పెన్నిధి, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, నియోజకవర్గ సీనియర్ నాయకుడు "ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి" గారు పూలమాల సమర్పించి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో నువ్వు చూడాలనుకుంటున్న మార్పు మొదట నీతో మొదలు కానీ, అన్నారు గాంధీజీ. ఏవైతే ఎదుటివారిలో వద్దు అనుకుంటామో వాటిని ముందు మనం పరిహరించుకోవాలి. "చెడు అనవద్దు వినవద్దు కనవద్దు" అన్నాడాయన. అసత్యం, అబద్ధం, ద్వేషం, మోసం, ద్రోహం, నేరం... ఇవి ఇప్పుడు పూర్తి చెడుకు కారణం అవుతున్నాయి. స్నేహం, త్యాగం, సమభావన, సహ జీవనం ఇవి విలువైనవిగా మారాయి. విలువలే మనుషుల్ని మహనీయులని చేస్తాయి. గాంధీజీని గౌరవించడం అంటే విలువల్ని కాపాడుకోవడమే అని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కెయస్. రఘు గారు, వైస్ చైర్మన్ డి. నజీర్ ఆహ్మద్ గారు, సునీల్ కుమార్ గారు, మాజీ మున్సిపల్ చైర్మన్ బుట్టారంగయ్య గారు, మైనార్టీ నాయకులు రియాజ్ ఆహ్మద్ గారు, పాల శ్రీనివాస్ రెడ్డి గారు, టౌన్ బ్యాంక్ చైర్మన్ యూకె. రాజశేఖర్ గారు, కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్లు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి కి నోచుకొని శివప్ప కాలనీ

### వినతిపత్రాము వరకే పరిమితం అభివృద్ధి శూన్యం
### చూసి చూడనట్టు నాయకులు అధికారులు
### అభివృద్ధి చేపట్టాలని కాలనీవాసులు



కౌతాళం అక్టోబరు 2, (( విభారె) ) మండల కేంద్రంలో శివప్ప నగర్ కాలనీ 8వార్డ్ గత 13 సం అభివృద్ధి కి నోచుకోలేదని సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ అస్సలు లేదని విధి దీపాలు ఒక రోజు వెలిగితే మరుసటిరోజు లేదని శివప్ప కాలనీ వాసులు మహిళలు, గిరి, పంచాయతీ కార్యాలయంలో గ్రామ సభలో మండిపడ్డారు. వారు మాట్లాడుతూ గత రెండునెలలుగా( 2/7 /21) గ్రామ సభలో వినతిపత్రాన్ని అందించము ఇంతవరకు అభివృద్ధి చేయలేదని, శివప్ప కాలనీ 13 సం నుంచి 2008 నుంచి పంచాయతీ ఇంటి గుత్తలు కట్టించుకుంటున్నారని చినుకుపడితే కాలనీలన్ని బురదమయం అయి ఉంటుందని ఆడవాళ్లు తిరగలంటే చాల ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు.నాయకులు ఓట్లు కోసం చేస్తామని అంటున్నారే తప్ప ఏమీ చేయలేదని ఆవేదన వ్యక్తంచేశారు. అధికారులు స్పందించి వెంటనే శివప్ప కాలనీ మరమ్మతులు చేపట్టి అభివృద్ధి పనులు చేయాలని ఎంపిడివో సూర్యనారాయణ కు వినతిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు,మహిళలు ఉన్నారు.

## ఘనంగా కేయి.కృష్ణమూర్తి జన్మదిన వేడుకలు

తుగ్గలి అక్టోబరు 2, (( విభారె) ) : మండల కేంద్రమైన తుగ్గలిలో మాజీ ఉప ముఖ్యమంత్రి వర్యులు కేఈ కృష్ణమూర్తి జన్మదిన వేడుకలను తుగ్గలి మండలం టిడిపి నాయకులు ఘనంగా నిర్వహించారు.శనివారం రోజున మండల కేంద్రంలోని ప్రాథమిక వైద్యశాల యందు కేఈ కృష్ణమూర్తి జన్మదినం సందర్భంగా రోగులకు బ్రెడ్లు మరియు పండ్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ పత్తికొండ నియోజకవర్గ అభివృద్ధి కొరకు కేఈ కృష్ణమూర్తి ఎంతో కృషి చేశారని వారు తెలియజేశారు.పత్తికొండ నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాలలో గ్రామాల అభివృద్ధికి కేయి కుటుంబం పెద్దపీట వేసిందని వారు తెలియజేశారు.కేఈ కృష్ణమూర్తి మారుమూల ప్రాంతాలకు రోడ్లు మరియు నీటి వసతి కల్పించి ప్రజల మన్నన పొందారని వారు తెలియజేశారు.తెలుగుదేశం పార్టీకు కంచుకోట గా ఉన్న పత్తికొండలో తెలుగుదేశం పార్టీ జెండా ను ఎగుర వేస్తామని మండల నాయకులు తెలియజేశారు.వచ్చే ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ తప్పకుండా అధికారంలోకి వస్తుందని వారు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు తిరుపాల్ నాయుడు,ఉపాధ్యక్షుడు వెంకటరాముడు చౌదరి,మాజీ ఎంపీపీ కొమ్మ వెంకటేష్,గిరిగెట్ల లింగయ్య,చెన్నంపల్లి లక్ష్మీ నారాయణ

## దళితుల సమస్యలపై పోరాడుతున్న ఏకైక సంస్థ కేవిపీయస్

### ఘనంగా కేవీపియస్. ఆవిర్భావ దినోత్సవం

మంత్రాలయంఅక్టోబరు 2, (( విభారె) ) : దళితుల సమస్యలపై పోరాడుతున్న ఏకైక సంస్థ కెవిపిఎస్ అని జిల్లా ఉపాధ్యక్షులు జయరాజు పేర్కొన్నారు. మండల కేంద్రంలో అంబేద్కర్ సర్కిల్లో కేవీపియస్ జండా ఆవిష్కరణ ఘనంగా జరిగింది.ఈ సందర్భంగా కేవీపియస్ జిల్లా ఉపాధ్యక్షులు జయరాజు కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ కెవిపిఎస్ 1998 ఆగస్టు 2వ తేదీ గాంధీ జయంతి రోజున సంఘాన్ని




స్థాపించడం జరిగింది. కెవిపిఎస్ తక్కువ కాలంలోనే దళితులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై రాజీలేని పోరాటాలు చేసిన ఏకైక సంఘం కెవిపిఎస్ అని అన్నారు. ఇప్పటికే దళితులు దేశంలో రాష్ట్రంలో అనేక ఇబ్బందులకు గురవుతున్నారని దళితులపై దాడులు దౌర్జన్యాలు దళిత మహిళలపై హత్యలు అత్యాచారాలు రోజురోజుకి పెరిగిపోతున్నాయని, ప్రభుత్వాలు పాలకులు. పట్టించుకునే పరిస్థితి కనబడటం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న కాలంలో దళితులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై పెద్ద ఎత్తున పోరాటాలకు సన్నద్ధం కావాలని వారు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు కెవిపిఎస్ మంత్రాలయం మండల కార్యదర్శి బి అనిల్ అధ్యక్షులు ఎస్ వీరేష్ కెవిపిఎస్ నాయకులు. యం. దావీదు .యం.ప్రకాశం .జి.నరసింహులు.ఆర్ ఆనంద్. యం. ప్రసంగి .యం భీమేష్ .యం.గిరిజన. డి.బిందాస్ . ౧.ప్రాణేష్.రమేష్ .డి.రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

## జాతిపిత మహాత్మాగాంధీ జయంతి వేడుకలు

నంద్యాల .– జాతిపిత మహాత్మాగాంధీ గారి ఫటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించిన నంద్యాల మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి. ఆయన మాట్లాడుతూ మహాత్మా గాంధీ గారు సత్యం, శాంతి,అహింసలే ఆయుధాలుగా చేసుకుని స్వాతంత్రం సాధించడంలో విజయం సాధించారని తెలిపారు , గాంధీజీ సేవలను కొనియాడుతూ గాంధీజీ ఆశయాలు సాధించడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని తెలియజేశారు, అలానే మాజీ ప్రధానమంత్రి లాల్ బహదూర్ శాస్త్రి గారి జయంతి సందర్భంగా దేశానికి వారు చేసిన సేవలను,వారి గొప్పతనాన్ని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. .



# మెగా మేనల్లుడి చిత్రానికి సపోర్ట్ గా అల్లు అర్జున్..!



మెగా హీరో సాయి ధరమ్ తేజ్ నటించిన "రిపబ్లిక్" సినిమా ఈరోజు శుక్రవారం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ప్రీమియర్ షో లతో మంచి స్పందన తెచ్చుకున్న ఈ చిత్రం పాజిటివ్ టాక్ తో నడుస్తోంది. అయితే రోడ్డు ప్రమాదానికి గురైె సాయి తేజ్ ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతుండటంతో సినిమాకు ప్రమోషన్స్ చేసుకోలేని పరిస్థితి వచ్చింది. ఈ నేపథ్యంలో మెగా హీరోలతో పాటుగా ఇండస్ట్రీ జనాలు – తేజ్ స్నేహితులు – అభిమానులు ఈ చిత్రానికి తమ వంతు మద్దతు ఇస్తున్నారు. స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్ ట్విట్టర్ వేదికగా అందరూ 'రిపబ్లిక్' సినిమాపై ప్రేమను చూపించమని కోరారు."ఈరోజు 'రిపబ్లిక్' సినిమా గ్రాండ్ గా రిలీజ్ అవుతోంది. నా సోదరుడు సాయి తేజ్ ఇక్కడ లేకపోవడం చాలా దురదృష్టకరం. ఈ సినిమాపై అభిమానులు ఌ ప్రజలు తమ ప్రేమను మద్దతును తెలియజేయాలని కోరుకుంటున్నాను. దేవకట్టా – ఐశ్వర్య రాజేష్ – రమ్యకృష్ణ మరియు మొత్తం చిత్ర బృందానికి నా శుభాకాంక్షలు" అని బన్నీ ట్వీట్ చేశారు. ఇక తేజ్ మేనమామ మెగాస్టార్ చిరంజీవి సైతం ఈ సినిమా సక్సెస్ అవ్వాలని కోరుకుంటూ స్పెషల్ గా ట్వీట్ చేశారు."సాయి ధరమ్ తేజ్ త్వరగా కోలుకుంటున్నాడు. అతడికి మీ అందరి ఆశీస్సులు 'రిపబ్లిక్' చిత్ర విజయం రూపంలో అందుతాయని ఆశిస్తూ.. ఆ చిత్ర యూనిట్ సభ్యులందరికీ అందరికీ నా శుభాకాంక్షలు. అలాగే కరోనా సెకండ్ వేవ్ బారినపడి కుదేలైన సినిమా ఎగ్జిబిషన్ సెక్టార్ కి 'రిపబ్లిక్' చిత్ర విజయం కూడా కోలుకోవడానికి కావాల్సిన ధైర్యాన్ని ఇస్తుంది అని ఆశిస్తున్నాను" అని చిరంజీవి ట్వీట్ లో పేర్కొన్నారు.కాగా 'రిపబ్లిక్' చిత్రానికి దేవకట్టా దర్శకత్వం వహించారు. పొలిటికల్ డ్రామాగా రూపొందిన ఈ చిత్రంలో ఐశ్వర్య రాజేష్ హీరోయిన్ గా నటించింది. రమ్యకృష్ణ – జగపతిబాబు – శ్రీకాంత్ అయ్యర్ – రాహుల్ రామకృష్ణ – సుబ్బరాజు తదితరులు ఇతర పాత్రలు పోషించారు. మణిశర్మ సంగీతం సమకూర్చిన ఈ చిత్రానికి ఎమ్ సుకుమార్ సినిమాటోగ్రఫీ అందించారు. జీ స్టూడియోస్ సమర్పణలో జె.బి. ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ పై జె. భగవాన్ – జె. పుల్లారావు సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించారు.

# 'బాహుబలి' బాటలోనే కమల్ మూవీ 'విక్రమ్'

కమలహాసన్ ఆ మధ్య శంకర్ దర్శకత్వంలో 'ఇండియన్ 2' సినిమా చేయడానికి రంగంలోకి దిగారు. అయితే కొన్ని కారణాల వలన ఆ సినిమా ఆగిపోయింది. దాంతో తన సొంత బ్యానర్ లో ఒక భారీ బడ్జెట్ సినిమా చేయాలని నిర్ణయించుకున్నారు. అనుకున్నదే తడవుగా 'విక్రమ్' సినిమాకి శ్రీకారం చుట్టారు. మొదటి నుంచి కూడా కమల్ ప్రయోగాత్మకమైన పాత్రలను చేస్తూ వస్తున్నారు. అలా ఆయన తన కెరియర్లో ఎన్నో విభిన్నమైన .. విలక్షణమైన పాత్రలను చేశారు. అశేష ప్రేక్షకుల చేత ప్రశంసలను అందుకున్నారు.కమల్ తనకి నచ్చిన కథలను తెరకెక్కించడానికి నిర్మాతలు సాహసించకపోతే తానే నిర్మాతగా మారిపోతుంటారు. ప్రయోగాత్మక



పాత్రల విషయంలో ఆయన సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకుంటూ ఉంటారు. అలాంటి సినిమాల వలన నష్టాలు వచ్చినా ఆయన పెద్దగా బాధపడరు. ఒక మంచి ప్రయత్నం చేశామని సంతృప్తిని పొందడం ఆయన ప్రత్యేకత. ఈ సారి కూడా అలాగే ఆయన 'విక్రమ్' సినిమా కోసం రంగంలోకి దిగారు. ఈ సినిమా కోసం ఆయన దర్శకుడిగా లోకేశ్ కనగరాజ్ ను ఎంచుకున్నారు. ఈ మధ్య కాలంలో తమిళనాట మురుగదాస్ తరువాత ఎక్కువగా వినిపిస్తున్న పేరు ఇది.లోకేశ్ కనగరాజ్ 'మానగరం' (నగరం) అనే ఒక చిన్న సినిమాతో దర్శకుడిగా తన కెరియర్ ను మొదలుపెట్టాడు. ఆద్యంతం ఆసక్తిని రేకెత్తించే స్క్రీన్ ప్లే తో ఈ కథ నడుస్తుంది. ఆ తరువాత కార్తి హీరోగా ఆయన 'ఖైదీ' చేశాడు. సినిమా మొత్తం హీరోను సింగిల్ కాస్ట్యూమ్ తో చూపిస్తూ బాక్సాఫీస్ దగ్గర కోట్ల వర్షాన్ని కురిపించాడు. ఇది కూడా స్క్రీన్ ప్లే తో నడిచే సినిమానే. ఆ తరువాత నేరుగా ఆయన విజయ్ హీరోగా 'మాస్టర్' సినిమా చేసే ఛాన్స్ కొట్టేశాడు. ఆయన ప్రతిభాపాటవాలను గమనిస్తూ వచ్చిన కమల్ .. ఆయనకి అవకాశం ఇచ్చారు.ప్రస్తుతం ఈ సినిమా .. షూటింగు దశలో ఉంది.కొన్ని రోజులుగా 'కారైక్కుడి'లో షూటింగు జరుగుతోంది. ప్రధాన పాత్రధారుల కాంబినేషన్లో కొన్ని ముఖ్యమైన సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. అయితే 'విక్రమ్' కథా పరిధి ఎక్కువగా ఉంటుందట. పాత్రలు .. మలుపులు .. నాటకీయత ఎక్కువగా ఉండటం వలన ఈ కథను రెండు భాగాలుగా చెబితే బాగుంటుందనే అభిప్రాయాన్ని లోకేశ్ కనగరాజ్ వ్యక్తం చేయగా కమల్ అందుకు అంగీకరించారని అంటున్నారు. అందువలన ముందుగా ఫస్టు పార్టును పూర్తి చేసే పనిలో ఉన్నారట. గతంలో 'బాహుబలి' విషయంలో కూడా ఇలాంటి నిర్ణయమే తీసుకున్నారు. రెండు భాగాలు కూడా సంచలన విజయాలను సాధించాయి. ఇక ప్రస్తుతం మణిరత్నం చేస్తున్న 'పొన్నియిన్ సెల్వన్' కూడా రెండు భాగాలుగానే రానుంది. చారిత్రక నేపథ్యంతో కూడిన ఈ సినిమాలో పాత్రల సంఖ్య ఎక్కువ. ఆ పాత్రల స్వరూప స్వభావాలను ఆవిష్కరించడానికీ అవి జనాలకు కనెక్ట్ కావడానికి రెండు భాగాలుగా చేయడమే సరైనదిగా భావించి అలాగే చేస్తున్నారు. ఇక తెలుగులో సుకుమార్ చేస్తున్న 'పుష్ప' సినిమాను కూడా రెండు భాగాలుగానే ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. 'విక్రమ్ కూడా అదే బాటలో నడవనుందన్న మాట.

# దసరా బాక్సాఫీస్ బరిలో నిలిచే సినిమాలు ఇవే..!



కరోనా సెకండ్ వేవ్ తరువాత మెల్లమెల్లగా సినీ పరిశ్రమ ట్రాక్ లోకి వస్తోంది. ఇటీవల కాలంలో అనేక చిన్న సినిమాలు థియేట్రికల్ రిలీజ్ అవ్వగా.. కంటెంట్ ఉన్న చిత్రాలకు ప్రేక్షకుల నుంచి మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈ క్రమంలో ఎన్నో అంచనాల మధ్య విడుదలైన 'లవ్ స్టోరీ' సినిమా రికార్డు స్థాయిలో కలెక్షన్లను రాబట్టడం ఇతర ఫిలిం మేకర్స్ ధైర్యాన్ని ఇచ్చింది. అక్టోబర్ నుంచి వరుసగా సినిమాలను రిలీజ్ చేయడానికి సన్నాహాలు చేసుకుంటున్నారు. ఈరోజు మొదలుకుని ఈ నెల చివరి వరకు అనేక సినిమాలు విడుదలకు సిద్ధం అయ్యాయి.దసరా బరిలో నిలిచే సినిమాల మీద కూడా ఇప్పటికే క్లారిటీ వచ్చేసింది. ముందుగా అనుకున్నట్లు భారీ బడ్జెట్ చిత్రాలు రాకపోయినా.. క్రేజీ చిత్రాలే ప్రేక్షకుల ముందుకు వస్తున్నాయి. 'ఖీలీ100' ఫేమ్ అజయ్ భూపతి దర్శకత్వంలో శర్వానంద్ – సిద్ధార్థ్ హీరోలుగా తెరకెక్కుతున్న మల్టీస్టారర్ మూవీ "మహాసముద్రం" అక్టోబర్ 14 న విడుదలవుతుంది. ఏకే ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ పై రూపొందిన ఈ సినిమాపై మంచి అంచనాలు ఉన్నాయి. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్ సినిమాపై బజ్ క్రియేట్ చేసింది.అఖిల్ అక్కినేని – పూజా హెగ్డే హీరోహీరోయిన్లుగా నటించిన రొమాంటిక్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ "మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్" అక్టోబర్ 15న థియేట్రికల్ రిలీజ్ అవుతోంది. బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వంలో గీతా ఆర్ట్స్ సంస్థ రూపొందించిన ఈ సినిమా కోసం సినీ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే టీజర్ – సాంగ్స్ మంచి స్పందన తెచ్చుకున్నాయి. లేటెస్టుగా రిలీజ్ అయిన థియేట్రికల్ ట్రైలర్ సినిమాపై అంచనాలు పెంచేసింది.నాగ శౌర్య – రీతూ వర్మ జంటగా నటించిన "వరుడు కావలెను" చిత్రాన్ని అక్టోబర్ 22న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. లక్ష్మీ సౌజన్య దర్శకత్వం వహిస్తున్న ఈ ఫ్యామిలీ ఎంటర్టైనర్ ని సితార ఎంటర్టైన్మెంట్స్ పతాకంపై రూపొందించారు. ఇక దసరా బరిలో దిగుతున్న విశాల్.. ఇప్పుడు వెనక్కి తగ్గనున్నట్లు తెలుస్తోంది. ఆర్య తో కలిసి విశాల్ నటించిన "ఎనిమీ" చిత్రాన్ని ముందుగా విజయ దశమి కానుకగా విడుదల చేస్తామని ప్రకటించారు. అయితే ఇప్పుడు రిలీజ్ డేట్ విషయంలో పునరాలోచలో పడినట్లు టాక్ నడుస్తోంది.ఇప్పటికే దసరా బాక్సాఫీస్ వద్ద ఫైట్ చేయబోయేది మూడు సినిమాలు మాత్రమే. రాబోయే రోజుల్లో మార్పులు చేర్పులు జరుగుతాయేమో చూడాలి. ఆంధ్రప్రదేశ్ లో పండుగ నాటికి థియేటర్లలో 100 శాతం ఆక్యుపెన్సీ రావడంతో పాటుగా టికెట్ల రేట్ల విషయంలో సానుకూల స్పందన వస్తుందని అందరూ భావిస్తున్నారు. ఇదే కనుక జరిగితే ఈ మూడు సినిమాలు మంచి వసూళ్ళు సాధించుకునే అవకాశం ఉంది.

# అతడు ఏదో ఒకరోజు టీమిండియాకు ఆడటం ఖాయం!



ఐపీఎల్–2021 సీజన్లో పంజాబ్ కింగ్స్ బౌలర్ అర్ష్‌దీప్ సింగ్ అదరగొడుతున్నాడు. జట్టు ప్రదర్శన ఎలా ఉన్నా బౌలింగ్‌లో మాత్రం రోజురోజుకీ అతడు మెరుగు పడుతున్నాడు. ముఖ్యంగా రెండో అంచెలో ఆడిన నాలుగు మ్యాచ్‌లలో 9 వికెట్లు తీసి సత్తా చాటాడు. మొత్తంగా ఈ సీజన్‌లో ఇప్పటి వరకు 10 మ్యాచ్‌లు ఆడిన అర్ష్‌దీప్.. 7.71 ఎకానమీతో 16 వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. ఇక ప్లే ఆఫ్స్ ఆశలు సజీవంగా ఉండాలంటే తప్పక గెలవాల్సిన శుక్రవారం నాటి మ్యాచ్‌లోనూ పంజాబ్ విజయంలో అతడు తన వంతు పాత్ర పోషించాడు. కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో మూడు కీలక వికెట్లు(శుభ్‌మన్ గిల్, నితీశ్ రాణా, దినేశ్ కార్తిక్) పడగొట్టాడు. ఈ నేపథ్యంలో టీమిండియా మాజీ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ అర్ష్‌దీప్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. అర్ష్‌దీప్ మంచి ఫామ్‌లో ఉన్నాడని... అతడి ప్రతిభను వినియోగించుకోవాలని భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ)కి సూచించాడు. "జహీర్ ఖాన్‌తో కలిసి పని చేశానన్న అర్ష్‌దీప్.. మూడు రోజుల్లోనే బంతిని ఎలా స్వింగ్ చేయాలో పూర్తిగా నేర్చేసుకున్నానని చెప్పాడు. అంత తక్కువ సమయంలోనే ఈ పని పూర్తి చేసిన ఈ ఫాస్ట్‌బౌలర్‌కు బీసీసీఐ మంచి సౌకర్యాలు కల్పించి.. శిక్షణ ఇస్తే తప్పకుండా ఇంకా మెరుగ్గా రాణిస్తాడు. తద్వారా అతడి ప్రతిభ వృథాగా పోకుండా ఉంటుంది. తను మంచి బౌలర్. ఇలాగే ఫామ్ కొనసాగిస్తే ఏదో ఒకరోజు టీమిండియాకు ఆడటం ఖాయం" అని క్రిక్‌బజ్‌తో పేర్కొన్నాడు. కాగా కేకేఆర్‌తో జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ 5 వికెట్ల తేడాతో గెలుపొందిన విషయం తెలిసిందే.




EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190